


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 6 సంచిక: 13, పేజీలు - 08
మంగళవారం, జులై 7, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## మహారాష్ట్రను ముంచెత్తుతున్న రుతుపవన ప్రళయం!

**- ముంబైలో రెడ్ అలర్ట్!**



**ముంబై (ప్రశ్న న్యూస్)** మహారాష్ట్ర వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు ఉగ్రరూపం దాల్చాయి. గత 48 గంటలుగా కురుస్తున్న అసాధారణ భారీ వర్షాలకు ఆర్థిక రాజధాని ముంబైతో పాటు సాంస్కృతిక రాజధాని పుణె నగరం పూర్తిగా స్తంభించిపోయాయి. ముఖ్యంగా పుణె జిల్లాలోని పశ్చిమ కనుమలు పరిధిలో మేఘమథనం జరుగుతోంది. ఘాట్ సెక్షన్లలోని పలు వాతావరణ కేంద్రాల్లో ఇప్పటికే 200 మిమీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదు కాగా, పుణె నగర పరిసర ప్రాంతాల్లో సగటున 100 మిమీ మార్కును దాటేసింది. ఈ జలప్రళయం కారణంగా ఇటు పుణె, అటు ముంబై, కొంకణ్ రీజియన్‌లలో జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. భారత వాతావరణ శాఖ

2లో..

## అంతర్జాతీయ
# టూరిజం హబ్‌గా తెలంగాణ

**- సీఎం రేవంత్ రెడ్డి మెగా మాస్టర్ ప్లాన్!**

- పర్యాటక రంగంపై సీఎం రేవంత్ ఉన్నతస్థాయి సమీక్ష
- తెలంగాణను అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యం
- తారామతి బారాదరి, దుర్గం చెరువు అభివృద్ధికి ఆదేశాలు
- వికారాబాద్, వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధిపై దృష్టి
- మరిన్ని ఎకో పార్కులు, ఫ్యూచర్ సిటీలో అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టులు
- పురానాపూల్‌ను పర్యాటక కేంద్రంగా మార్చే ప్రతిపాదన





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ పర్యాటక రంగ పటంలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త విప్లవాత్మక మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. పర్యాటక శాఖపై సోమవారం ఆయన నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ఐకానిక్ దుర్గం చెరువు పరిసరాలను అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వరల్డ్ క్లాస్ టూరిజం హబ్‌గా మార్చాలని అధికారులను ఆదేశించారు. దీనితో పాటు చారిత్రక తారామతి బారాదరిని ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు, హైదరాబాద్ నగరంలో ఉన్న ప్రముఖ మంజీర, దిల్కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునీకరించి సరికొత్త హంగులు అద్దాలని సీఎం స్పష్టం చేశారు. హైదరాబాద్‌కు ఆనుకుని ఉన్న ప్రకృతి రమణీయ ప్రాంతం వికారాబాద్ జిల్లాను ఒక మెగా టూరిజం హబ్ గా మార్చాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఇందులో భాగంగా వికారాబాద్‌లోని ప్రసిద్ధ అనంత పద్మనాభస్వామి, వీరభద్రస్వామి ఆలయాలను పూర్తిస్థాయిలో అప్‌గ్రేడ్ చేయనున్నారు. యాదాద్రి తరహాలోనే ఈ ఆలయాలకు కూడా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాన్ని డెవలప్ చేయనున్నారు. అలాగే అటవీ శాఖ పరిధిలోని

2లో..

## జకార్తాలో మోదీకి అరుదైన గౌరవం

**- స్వయంగా వచ్చి ఆహ్వానించిన ఇండోనేషియా అధ్యక్షుడు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఇండోనేషియా రాజధాని జకార్తాకు చేరుకున్నారు. రెండు రోజుల పర్యటన కోసం అక్కడి చేరుకున్న ఆయనకు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో స్వయంగా విమానాశ్రయానికి వచ్చి స్వాగతం పలకడం విశేషం. ఇరు దేశాల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలకు ప్రతీకగా ఈ ప్రత్యేక ఆతిథ్యాన్ని భావిస్తున్నారు. భారత ప్రధాని ప్రయాణిస్తున్న ప్రత్యేక విమానం ఇండోనేషియా గగనతలంలోకి ప్రవేశించిన వెంటనే ఆ దేశ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ఎస్కార్ట్ చేశాయి. జకార్తా విమానాశ్రయంలో సంప్రదాయ ఇండోనేషియా నృత్య ప్రదర్శనలతో మోదీకి ఆత్మీయ స్వాగతం లభించింది. ఈ పర్యటనలో మోదీ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. భారత్-ఇండోనేషియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం, వాణిజ్యం, రక్షణ, సముద్ర భద్రత, పెట్టుబడులు, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించడంపై ఇరువురు నేతలు చర్చించనున్నారు. పర్యటనకు ముందు విడుదల చేసిన ప్రకటనలో 2018లో భారత్-ఇండోనేషియా సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా అభివృద్ధి చేశామని మోదీ గుర్తు చేశారు. ఈ భాగస్వామ్యం తర్వాత తన తొలి ద్వైపాక్షిక పర్యటన ఇదేనని పేర్కొన్నారు. అలాగే ఈ ఏడాది గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రబోవో పర్యటనకు కొనసాగింపుగానే ఈ భేటీ జరుగుతోందని తెలిపారు. ఇండోనేషియాలోని

2లో..



## ఆర్టీజీ కేంద్రం నుంచి
# ఇక 24 గంటల సేవలు

- ప్రజా సమస్యలపై రియల్ టైమ్‌లో స్పందించాలని అధికారులకు సీఎం ఆదేశం
- పీజీఆర్ఎస్ కింద పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి
- పట్టణ ప్రాంతాల్లో జీరో వేస్ట్ లక్ష్యంగా మూడు నెలల్లో చెత్త తొలగింపు
- గంజాయిపై ఉక్కుపాదం మోపాలి, మహిళల భద్రతకు పెద్దపీట

అమరావతి (ప్రశ్న న్యూస్) ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై రియల్ టైమ్‌లోనే స్పందన ఉండాలని, ప్రభుత్వ సేవల్లో వేగాన్ని పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఐదు రోజుల జిల్లాల పర్యటన ముగించుకుని అమరావతికి చేరుకున్న ఆయన, సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) కేంద్రంలో ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. పురపాలక, పంచాయితీరాజ్, హోం, ఎక్సైజ్ వంటి కీలక శాఖల పనితీరు, ప్రజా సేవల్లో నాణ్యతపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. వేగంగా స్పందించగలిగితేనే పౌరులకు మెరుగైన సేవలు అందించగలమని, పాలనలో జవాబుదారీతనం పెరుగుతుందని ఆయన అన్నారు. రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రం నుంచి ప్రజలకు వాస్తవ సమయంలోనే స్పందన

2లో..

## ప్రభుత్వంపై
# వైసీపీ ‘బీసీ’ అస్త్రం

**- భారీ సభలు, కీలక నిర్ణయాలు**



**అమరావతి**(ప్రశ్న న్యూస్) ఏపీ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కూటమి వర్సస్ వైసీపీ కొత్త రాజకీయం మొదలు పెట్టాయి. రెండు వైపులా 2029 ఎన్నికలే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. వైసీపీ సామాజిక సమీకరణం మొదలు పెట్టింది. కొద్ది రోజుల క్రితం వైసీపీకి చెందిన కాపు నేతలు సమావేశం అయ్యారు. ఇప్పుడు అదే పార్టీ బీసీ నేతలు సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకు న్నారు. ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ భారీ సభలు సమావేశాలకు సిద్ధం అవుతున్నారు.

2లో..

## కాళేశ్వరం అవినీతిపై రేవంత్ రెడ్డి
# మౌనమెందుకు.?

- కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు ఆడుతున్నారన్న రాంచందర్ రావు
- జాతీయ డ్యాం భద్రతా సంస్థ హెచ్చరించినా మరమ్మతులు చేపట్టలేదని విమర్శ
- హైడ్రా కేవలం పేదల ఇళ్లను టార్గెట్ చేస్తోందని మండిపాటు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జనసంఘ్ స్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తదితర నేతలు ఆయన చిత్రపటానికి

2లో..

## హుస్సేన్ సాగర్ ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణం

- హైడ్రా - జీహెచ్ ఎంసీ కమిషనర్లతో పాటు కలెక్టర్ సంయుక్త విచారణ
- ఇరిగేషన్ శాఖ ఫిర్యాదు మేరకు అధికారుల పరిశీలన



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరానికి తలమానికమైన హుస్సేన్ సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలో అక్రమ నిర్మాణం జరుగుతోందన్న ఆరోపణలపై అధికారులు దృష్టి సారించారు. నీటిపారుదల శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఓ నిర్మాణాన్ని చేపడుతోందని ఫిర్యాదులు రావడంతో సోమవారం ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్

2లో..

## ఖరీదైన ఇళ్ల విక్రయాల్లో హైదరాబాద్ అగ్రస్థానం

**- బెంగళూరు, చెన్నై వెనక్కి!**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దక్షిణ భారతదేశంలోని మూడు ప్రధాన నగరాల్లో అల్ట్రా-లగ్జరీ గృహాల మార్కెట్ సరికొత్త శిఖరాలకు చేరింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల్లో రూ.10 కోట్లు అంతకంటే ఎక్కువ విలువైన 811 విలాసవంతమైన ఇళ్లు అమ్ముడయ్యాయి. వీటి మొత్తం అమ్మకాల విలువ రూ.11,246

2లో..

## బీఆర్ఎస్ పార్టీని బద్నాం చేయడమే
# రేవంత్ రెడ్డి లక్ష్యం

- మీరు వడ్ల బస్తాలు మోసి కష్టపడితే, రేవంత్ రెడ్డి డబ్బులు మోసి కష్టపడుతున్నాడు
- ఈ రేవంత్ రెడ్డి అన్నదాతలను అష్టకష్టాలపాలు చేస్తున్నాడు
- హమాలీ కార్మికులకు ఆరోగ్య భద్రతతో పాటు ఏ రకమైన సమస్యలు ఉన్నా నెరవేర్చే బాధ్యత మనది




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ‘రాష్ట్ర పాలకుడు మంచివాడైతేనే ప్రజలంతా సంతోషంగా ఉంటారు. అధికారం పోయినా కేసీఆర్‌పై ప్రజల ప్రేమ తగ్గలేదు. ఈ కష్టకాలంలోనూ మమ్మల్ని గుండెల్లో పెట్టుకున్న హమాలీ సోదరుల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది మీ ప్రతి సమస్యను పరిష్కరించే బాధ్యత నాది’అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని మల్లాపూర్‌లో జరిగిన 18వ హమాలీ యూనియన్ మహాసభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ‘కార్మిక లోకం ఐకమత్యంగా, గట్టిగా నిలబడాలి. రాబోయే రెండేండ్లలో మళ్లీ మన కేసీఆర్ గారిని ముఖ్యమంత్రిని చేసుకుందాం తెలంగాణను తిరిగి ప్రగతి పథంలో నడిపిద్దాం!’ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు.

### ఢిల్లీకి డబ్బు మూటలు మోస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

‘బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మీరు వడ్ల బస్తాలు మోసి కష్టపడ్డారు. కానీ ఇవాళ రేవంత్ రెడ్డి కూడా కష్టపడుతున్నాడు. అయితే ఆయన ఏ సంచులు మోస్తున్నాడో నాకంటే మీకే బాగా తెలుసు. ఆ మూటలను రేవంత్ రెడ్డి ఎక్కడికి మోస్తున్నాడో కూడా రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు’అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు. ‘ఢిల్లీలో ఉన్న పెద్దల కోసం డబ్బుల మూటలు మోసి మోసి తను కష్టపడుతున్నాడు. కాళేశ్వరంలో అంతర్భాగమైన కన్నెపల్లి పంప్ హౌస్‌లో రెండు పంపులు స్టార్ట్ చేస్తే తెలంగాణ మొత్తం సుభిక్షం అవుతుందని మేము చెప్పడం జరిగింది. కానీ రేవంత్ రెడ్డి మాత్రం ఆ పని చేయడం లేదు. ఎందుకంటే బీఆర్ఎస్ పార్టీని బద్నాం చేయడమే రేవంత్ రెడ్డి లక్ష్యం. ఇక ఈ గొడవ అంతా ఎందుకని నీళ్లే ఇవ్వకపోతే ఏ గొడవ ఉండదని ఇవాళ నీళ్లు ఉన్నా మన పంటలను ఎండబెడుతున్నాడు, రైతులను అరిగోసలు పెడుతున్నాడు. ఈ రేవంత్ రెడ్డి అన్నదాతలను అష్టకష్టాలపాలు చేస్తున్నాడు’అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు.

2లో..

## బీజేపీ నేతలు రాముడి హుండీలోని సొమ్మును కూడా లూటీ చేశారు

- ఈ స్కామ్ కు మోదీ, అమిత్ షా, యోగి బాధ్యత వహించాలని డిమాండ్
- దేశ ప్రజలకు బీజేపీ క్షమాపణలు చెప్పాలన్న పొన్నం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అయోధ్య రామ మందిర విరాళాల సేకరణలో కోట్ల రూపాయల భారీ అవినీతి జరిగిందంటూ తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాజకీయ ఎదుగుదల కోసం దేవుడిని వాడుకోవడంలో బీజేపీ పరాకాష్ఠకు చేరిందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలు తమ స్తోమతకు తగినట్లుగా రామయ్య గుడి కోసం విరాళాలు ఇస్తే, కమలం పార్టీ నేతలు ఆ సొమ్మును కూడా వదలకుండా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. “బీజేపీ నాయకులు

2లో..

ప్రజాప్రశ్న



# మహారాష్ట్రను ముంచెత్తుతున్న రుతుపవన ప్రళయం!

ముంబై, ఠాణే, పాల్ఘర్, రాయ్‌గఢ్ జిల్లాలకు అత్యంత ప్రమాదకరమైన రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ భారీ వర్షాల ధాటికి ముంబై-పుణె నగరాల మధ్య రవాణా వ్యవస్థ పూర్తిగా పడకేసింది. నిరంతరాయంగా కురుస్తున్న వానలకు ముంబై-పుణె ఎక్స్‌ప్రెస్‌వే లోని ఖోపోలి-కుస్గావ్ మిస్సింగ్ లింక్ సొరంగం సమీపంలో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. టన్నుల కొద్దీ రాళ్లు, మట్టి రోడ్డుపైకి దూసుకురావడంతో ఎక్స్‌ప్రెస్‌వేతో పాటు పాత ముంబై-పుణె హైవేపై కూడా రాత్రీపగలు ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేశారు. ముంబై డివిజన్ పరిధిలోని ఠాకూర్వాడి - మంకీ హిల్ సెక్షన్ల మధ్య రైల్వే ట్రాక్‌లపై కూడా కొండరాళ్లు పడటంతో ముంబై-పుణె మధ్య నడిచే ఇంటర్‌సిటీ మరియు సుదూర ప్రాంతాల రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది లేదా దారిమళ్లించింది.వర్షాల తీవ్రతను దృష్ట్యా ముంబై, పుణె, ఠాణే, నవీ ముంబై పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలకు విద్యాశాఖ తక్షణ సెలవు ప్రకటించింది. ప్రైవేట్ ఆఫీసుల ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని విపత్తు నిర్వహణ శాఖ సూచించింది. రహదారులపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పుణె జిల్లాలోని మావల్ తహసీల్ పరిధిలో ఒక ఇల్లు కొండచరియల కింద నలిగిపోగా, ఇంద్రాయణి నది ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ఆలంది మున్సిపల్ కౌన్సిల్ నదిపై ఉన్న అన్ని వంతెనలను మూసివేసింది. పుణె-కోలాడ్ రోడ్డు ఒక విభాగంలో కుంగిపోవడంతో ఆ రూట్ క్లోజ్ అయింది. పర్యాటకుల భద్రత దృష్ట్యా ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన సింహగఢ్ కోట ను రెండు రోజుల పాటు పూర్తిగా బంద్ చేశారు. పుణె శివార్లలో వరదల్లో చిక్కుకుపోయిన ఒక ప్రైవేట్ బస్సులోని 37 మంది ప్రయాణికులను ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ప్రాణాలకు తెగించి సురక్షితంగా రక్షించాయి.ఇటు ముంబై నగరంలో పరిస్థితి మరింత దారుణంగా మారింది. విక్రోలి, కొలాబా, మాతుంగ వంటి లోతట్టు ప్రాంతాలు మోకాళ్లోతు నీటిలో మునిగిపోయాయి. పశ్చిమ రైల్వే పరిధిలోని వసాయ్ రోడ్ - విరార్ సెక్షన్లలో పట్టాలు పూర్తిగా నీట మునగడంతో 20 కి పైగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు మధ్యలోనే నిలిచిపోయాయి. ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో రన్‌వే రక్షణ చర్యల దృష్ట్యా విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మహారాష్ట్ర అసెంబ్లీని సైతం వర్షాల కారణంగా ఒకరోజు వాయిదా వేయాల్సి వచ్చింది. గత 3-4 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా వర్ష సంబంధిత ఘటనల్లో 13 మంది ప్రాణాలు కోల్పోయారని విపత్తు నిర్వహణ మంత్రి గిరీష్ మహాజన్ ప్రకటించారు.

# అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తెలంగాణ

క్యూర్ ఏరియా భూములను ఎకో-టూరిజం స్పాట్లుగా మార్చాలని, గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలోనే హైదరాబాద్ నలుమూలలా అధునాతన ఎకో పార్కులను నిర్మించాలని అటవీ, పర్యాటక శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మూడో నగరంగా రూపుదిద్దుకుంటున్న ప్రతిష్టాత్మక ఫ్యూచర్ సిటీ లోని అటవీ భూములను అంతర్జాతీయ ప్రమాణాలతో అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టులుగా మార్చనున్నారు. ఈ పనులను వేగవంతం చేసేందుకు ఒక ప్రత్యేక అధికారిని నియమించనున్నారు. చారిత్రక భాగ్యనగర వారసత్వ సంపదను కాపాడే క్రమంలో భాగంగా మూసీ నదిపై ఉన్న పురాతన పురానాపూల్ హెరిటేజ్ బ్రిడ్జ్ ను పర్యాటకులను ఆకర్షించేలా సరికొత్త పర్యాటక వేదికగా రీ-డిజైన్ చేయనున్నారు. పర్యాటకులకు అవసరమైన అన్ని రకాల ఆధునిక వసతులు, సౌకర్యాలను ఇక్కడ కల్పించనున్నారు. ఈ చారిత్రక వంతెనను వీక్షించేందుకు వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు వీలుగా ఆ ప్రాంతంలో ట్రాఫిక్ డైవర్షన్ ప్రణాళికలను సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ట్రాఫిక్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ భారీ పర్యాటక, మౌలిక వసతుల ప్రాజెక్టులకు అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ఏడాది డిసెంబర్ 2026 లో ప్రతిష్టాత్మక గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ నిర్వహించేందుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ సమ్మిట్‌కు సంబంధించిన సన్నాహక పనులను ఇప్పుడే ప్రారంభించాలని, పర్యాటక, అటవీ, మున్సిపల్, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం కోసం ఒక ప్రత్యేక ఇంటర్-డిపార్ట్‌మెంటల్ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు. రేవంత్ రెడ్డి మార్క్ ఈ నయా టూరిజం ప్లాన్ తెలంగాణ ఆదాయాన్ని పెంచడమే కాకుండా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని పర్యాటక రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# జకార్తాలో మోదీకి అరుదైన గౌరవం

భారతీయ ప్రవాసులతో మోదీ సమావేశం కానున్నారు. అలాగే ప్రబోవోతో కలిసి యోగ్యకర్తలోని ప్రసిద్ధ ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శించనున్నారు. ఈ ఆలయం భారత్-ఇండోనేషియా సాంస్కృతిక బంధానికి ప్రతీకగా నిలుస్తుందని మోదీ పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో ఇరు దేశాల మధ్య రక్షణ, సముద్ర భద్రత రంగాల్లో సహకారం మరింత బలపడింది. బ్రహ్మోస్ క్షిపణుల విక్రయం, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రత, సైనిక శిక్షణ, రక్షణ పరిశ్రమల్లో భాగస్వామ్యం విస్తరిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత్-ఇండోనేషియా ద్వైపాక్షిక వాణిజ్యం 24.78 బిలియన్ డాలర్లకు చేరగా, 130కి పైగా భారత కంపెనీలు ఇండోనేషియాలో పెట్టుబడులు పెట్టాయి. డోనేషియా పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో పర్యటించనున్నారు.

# ఆర్టీజీ కేంద్రం నుంచి ఇక 24 గంటల సేవలు

అందాలని చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖ సముద్ర తీరంలో బోటు మునిగి మత్స్యకారులు గల్లంతైన ఘటనను ఉదాహరణగా చూపుతూ, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో వివిధ ప్రభుత్వ విభాగాలు ఎంత తక్షణమే సమన్వయంతో స్పందించాయన్నదే కీలకమని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం మధ్య సమన్వయం కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) ఆధ్వర్యంలో తరచూ మల్టీ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేషన్ సమావేశాలు జరగాలని సూచించారు. ఆర్టీజీ కేంద్రం 24 గంటలూ ప్రజలకు సేవలందించేలా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని నిర్దేశించారు."ఏఐ మెథడాలజీ ద్వారా చిత్తూరు జిల్లాలో సంతృప్తి స్థాయి నమోదు చేస్తున్నాం. అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయడం వల్ల ప్రజాభిప్రాయం నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. నియోజకవర్గ స్థాయిలో 'లాస్ట్ మైల్ గవర్నెన్స్' ప్రజలకు అందాలి. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాపాలనలో పొలిటికల్ మేనేజ్‌మెంట్, బ్యూరోక్రటిక్ యాక్షన్ సమపాళ్లలో ఉండాలి," అని ముఖ్యమంత్రి విశ్లేషించారు.

### పీజీఆర్ఎస్ పరిష్కారానికి యాక్షన్ ప్లాన్

పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సీఎం చంద్రబాబు గట్టిగా ఆదేశించారు.

వివిధ కేటగిరీలు, శాఖలకు చెందిన పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ఒక పక్కా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఆర్థిక, ఆర్థికేతర అంశాలుగా విభజించి, ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారం చూపాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా కలెక్టర్లు, ఉన్నతాధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు.

### పట్టణాల్లో 'జీరో వేస్ట్' లక్ష్యం

రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పేరుకుపోయిన 23 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను రాబోయే మూడు నెలల్లోగా యుద్ధప్రాతిపదికన తొలగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు

పట్టణ ప్రాంతాల్లో 'జీరో వేస్ట్' సాధించడమే మన లక్ష్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ బృహత్కార్యంలో ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములై శ్రద్ధ పెట్టాలని కోరారు. క్షేత్రస్థాయిలో తాగునీరు, వ్యర్థాల సేకరణకు స్వచ్ఛ రథాలు, ఇంటింటికీ చెత్త సేకరణ వంటి కార్యక్రమాలపై నిర్దిష్ట ప్రామాణిక కార్యాచరణ విధానం జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

### గంజాయిపై ఉక్కుపాదం.. భద్రతకు పెద్దపీట

రాష్ట్రంలో గంజాయి ముఠాలను పూర్తిగా నియంత్రించాలని, వాటిపై ఉక్కుపాదం మోపాలని హోం శాఖ అధికారులకు సీఎం నిర్దేశించారు.

కేంద్ర ప్రభుత్వం 'డ్రగ్ ఫ్రీ కంట్రీ' లక్ష్యంతో పనిచేస్తోందని, దానికి అనుగుణంగా రాష్ట్రంలో గంజాయి నిర్మూలనకు గట్టి చర్యలు తీసుకోవాలని అన్నారు. గంజాయి నిర్మూలనపై తీసుకుంటున్న చర్యల సమాచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. అదే సమయంలో మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గాలని, వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కూడా సూచించారు.

ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల ద్వారా ఎలాంటి ఫలితాలు సాధిస్తున్నామో ఎప్పటికప్పుడు విశ్లేషించుకోవాలని, పాలనలో పొదుపు మంత్రాన్ని పాటించాలని అధికారులకు హితవు పలికారు. మారుమూల ప్రాంతాల్లో కమ్యూనికేషన్ నెట్‌వర్క్ కనెక్టివిటీ కోసం టవర్లను ఏర్పాటు చేసేందుకు టెలికాం ఆపరేటర్లతో మాట్లాడి కార్యాచరణ చేపట్టాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, పురపాలక, ఎక్సైజ్, పోలీసు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వంపై వైసీపీ 'బీసీ' అస్త్రం

వైసీపీ ప్రభుత్వం పైన సామాజిక అస్త్రాలను ఎక్కు పెట్టింది. పార్టీ బీసీ నేతలు సమావేశం నిర్వహించారు. బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ప్రభుత్వం పైన విమర్శలు గుప్పించారు. బీసీల ఓట్లతో గెలిచి, రెండేళ్ల పాలనలో వారికిచ్చిన ఒక్క హామీని కూడా చంద్రబాబు అమలుచేయలేదని మండిపడ్డారు. వరలో దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ మేరకు వచ్చే నెలలో విజయవాడలో బీసీల సభ ఏర్పాటు చేసి ప్రజలకు చంద్రబాబు మోసాల్ని వివరిస్తామని ప్రకటించారు. రెండేళ్ల కూటమి పాలనలో బలహీనవర్గాలపై జరుగుతున్నాయని ఆరోపించారు. బీసీలకు చంద్రబాబు ఏం చెప్పారు, ఎలా మోసం చేశారన్న దానిపై జనాలకు వాస్తవాలు వివరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. వచ్చే నెలలో విజయవాడ నగరంలో వైయస్‌ఆర్‌సీపీ బీసీ నేతలంతా ఓ సమావేశం ఏర్పాటు చేసుకుని కార్యాచరణ ఖరారు చేయాలని డిసైడ్ అయ్యారు. జోనల్ వారీగా ఈ కార్యాచరణ ఉండేలా డిసైడ్ చేసారు.

### విజయవాడలో సభలు.. జిల్లాల వారీగా సమావేశాలు

అదే విధంగా బలహీన వర్గాలంతా ఒక్కటే, అంతా ఒక్క తాటిపైకి వచ్చి బలవంతులుగా మారి శక్తివంచన లేకుండా పోరాడతామని మాజీ మంత్రి జోగి రమేశ్ ప్రకటించారు. 2014-19 మధ్య చంద్రబాబు తన పాలనలో బీసీ అయిన కేఈ కృష్ణమూర్తిని డిప్యూటీ సీఎంగా కొనసాగించారని తమ ప్రభుత్వ హయాంలో బీసీలతో పాటు మొత్తం ఐదు వర్గాలకు డిప్యూటీ సీఎంలుగా పదవులు ఇచ్చారని చెప్పుకొచ్చారు. కానీ ఇప్పుడు చంద్రబాబు రెండేళ్లుగా బీసీ వర్గానికి ఎందుకు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వకపోవడం వెన్నుపోటు కాదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలకూ, అమలుకూ ఏమాత్రం పొంతన లేదని పిల్లి సుభాష్ చంద్రబాబు ప్రశ్నించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడం వల్ల బీసీ వర్గాలు ఏ విధంగా నష్టపోతున్నాయని, వారికిచ్చిన హామీలకు ఎందుకు తిలోదకాలు ఇచ్చారని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్ మెంట్ చేయకపోవడం వల్ల కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఫీజును తల్లితండ్రులు అప్పులు చేసి చెల్లించాల్సి వస్తోందని ఆరోపించారు.

# హుస్సేన్ సాగర్ ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణం

ప్రియాంక అల నేతృత్వంలోని బృందం నిర్మాణ స్థలాన్ని సంయుక్తంగా తనిఖీ చేసింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి తమ శాఖ నుంచి ఎటువంటి అనుమతులు జారీ చేయలేదని నీటిపారుదల శాఖ స్పష్టం చేయడంతో ఈ తనిఖీలు చేపట్టారు. ప్రస్తుతం నిర్మాణానికి సంబంధించిన అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, పూర్తిస్థాయి విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపట్టే నిర్మాణాలపై ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోంది. హైదరాబాద్ నగరానికి చారిత్రక, పర్యావరణ వారసత్వంగా ఉన్న హుస్సేన్ సాగర్‌ను సంరక్షించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

# ఖరీదైన ఇళ్ల విక్రయాల్లో హైదరాబాద్ అగ్రస్థానం

ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో తక్కువ ధరకే ఎక్కువ స్థలం లభించడం ఈ వృద్ధికి కీలక కారణంగా కనిపిస్తోంది. ఉదాహరణకు, రూ.10 కోట్లతో హైదరాబాద్‌లో సుమారు 6,210 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు కొనుగోలు చేయగలిగితే, అదే మొత్తానికి చెన్నైలో 4,290 చదరపు అడుగులు, బెంగళూరులో కేవలం 3,930 చదరపు అడుగుల స్థలం మాత్రమే లభిస్తోంది. హైదరాబాద్‌లోని కోకాపేట, బెంగళూరులోని రాజనుకుంటె ప్రాంతాలు అల్ట్రా-ప్రీమియం ప్రాజెక్టులకు హాట్‌స్పాట్‌లుగా నిలిచాయి. ఈ నివేదికపై ఇండియా సోథెబైస్ ఇంటర్నేషనల్ రియాల్టీ సీఈఓ అశ్విన్ చద్దా మాట్లాడుతూ, "దక్షిణ భారతదేశంలోని లగ్జరీ గృహాల మార్కెట్ మూడు విభిన్న నగరాల ప్రత్యేకతలతో రూపుదిద్దుకుంటోంది. అమ్మకాల పరిమాణంలో హైదరాబాద్ అగ్రగామిగా నిలుస్తుండగా, బెంగళూరు వేగవంతమైన వృద్ధి సామర్థ్యాన్ని ప్రదర్శిస్తోంది. మరోవైపు చెన్నై తన పాత, ప్రతిష్టాత్మకమైన ప్రీమియం ప్రాంతాలపై ఆధారపడి స్థిరంగా కొనసాగుతోంది," అని వివరించారు.సీఆర్ఈ మ్యాట్రిక్స్ సహ-వ్యవస్థాపకుడు, సీఈఓ అభిషేక్ కిరణ్ గుప్తా మాట్లాడుతూ, ఈ రంగం ఒక కీలక మలుపుకు చేరుకుందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ మార్కెట్‌కు బలమైన పునాదులు ఉన్నాయని, బెంగళూరు సంప్రదాయ ఉన్నత వర్గాల ప్రాంతాలకు అతీతంగా విస్తరిస్తోందని పేర్కొన్నారు. ప్రతి మార్కెట్‌కు అనుగుణంగా ప్రత్యేకమైన పెట్టుబడి వ్యూహాలు అవసరమని ఆయన సూచించారు. ఈ నగరాలు ఐటీ, వ్యాపార కేంద్రాలుగా వేగంగా వృద్ధి చెందడంతో అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు, సంపన్న కొనుగోలుదారులు విశాలమైన, అత్యున్నత సౌకర్యాలున్న గృహాల వైపు మొగ్గుచూపుతున్నారని నివేదిక స్పష్టం చేస్తోంది.

# బీఆర్ఎస్ పార్టీని బద్నాం చేయడమే రేవంత్ రెడ్డి లక్ష్యం

### తన వీపు సాపవుతుందని రేవంత్ రెడ్డికి బాగా తెలుసు

'నాడు బీఆర్ఎస్ హయాంలో భూములకు ఉన్న రేట్లు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తిగా పడిపోయిన పరిస్థితి నెలకొంది. ప్రజల కోసం కొట్లాడుతున్న మా మీద ఈ రేవంత్ రెడ్డి రెండు కేసులు పెడతారు, మాకేం పర్వాలేదు.'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు. 'ఒకవేళ మీ మీద కేసులు పెడితే మాత్రం తన వీపు సాపవుతుందని రేవంత్ రెడ్డికి బాగా తెలుసు. గతంలో హమాలీలు ఎన్నో విధాలుగా ఇబ్బందులు పడ్డారు. కేసీఆర్ దయతో 8 రూపాయలు ఉన్న రేట్లను 26 రూపాయలకు పెంచడం జరిగింది.అది కేసీఆర్ ఘనతగా వారు భావించి సంతోషపడ్డారు. 250 శాతం రేట్లు పెంచుకున్నామని హమాలీలు సంబరపడ్డారు. గతంలో ఐదు సంవత్సరాలకు ఒకసారి రేట్లు పెరిగితే, కేసీఆర్ వచ్చాక రెండు సంవత్సరాలకు ఒకసారి రేట్లు పెంచుకొని చాలా సంతోషంగా ఉన్నామని హమాలీ కార్మికులు సంతోషాన్ని వ్యక్తం చేశారు'అని కేటీఆర్ గుర్తు చేశారు.

### హమాలీల సమస్యలను తీర్చే బాధ్యత నాది

'హమాలీ కార్మికులకు ఆరోగ్య భద్రతతో పాటు ఏ రకమైన సమస్యలు ఉన్నా నెరవేర్చే బాధ్యత మనది. ఈ రాష్ట్రంలో గులాబీ జెండా ఎగరడం తథ్యం, అంతే కాకుండా హమాలీల సమస్యలు తీర్చడం సైతం జరుగుతుంది ఒక్కటి కూడా వదిలి పెట్టకుండా అన్ని తీర్చే బాధ్యత నాది'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చారు. 'తెలంగాణలో కేసీఆర్ వచ్చిన తర్వాత ఏ తీరుగా వడ్లు పండాయో మీ అందరికీ తెలుసు. ఏ విధంగా పంటలు సస్యశ్యామలంగా మారాయో మీ అందరికీ తెలుసు. రాష్ట్రంలో సాగు విస్తీర్ణం సైతం గణనీయంగా పెరిగింది. కేసీఆర్ వచ్చాక ఈ రాష్ట్రంలో ప్రజలకు అన్నం పెట్టే విధంగా అటు రైతులు కష్టపడితే, ఇటు బస్తాలు మోసి మోసి హమాలీ కార్మికులు మీ వీపులు కాయలు కాచిన పరిస్థితి నెలకొంది. నేడు రాష్ట్రంలో వర్షాలు లేక రైతులు ఆకాశాన్ని దిగాలుగా చూస్తున్న పరిస్థితి నెలకొంది. నిన్న మేము కాళేశ్వరంలోని కన్నెపల్లి పంప్ హౌస్ సందర్శించడం జరిగింది, కానీ అక్కడ లక్ష క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలో కలుస్తోంది'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు.

### రాష్ట్రాన్ని నడిపే వ్యక్తి మంచి బుద్ధి కలిగి ఉండాలి

'కేసీఆర్ రాష్ట్రంలో ఎక్కడైతే నీళ్లు ఉంటాయో గోదావరిలో, ఆ పాయింట్‌ను వెతికి మరి పట్టుకొని అక్కడ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం జరిగింది. నిన్న మేము అక్కడి నుండి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరిగింది.మా పైన ఏమైనా కోపం ఉంటే ఏమైనా కేసులు పెట్టుకోండి.అంతేకానీ మా మీద ఉన్న కోపాన్ని రైతుల మీద తీయొద్దని రిక్వెస్ట్ చేయడం జరిగింది'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు. 'ఇప్పుడు నీళ్లు ఇస్తే యూరియా ఇవ్వాలి. యూరియా ఇస్తే పంటలు పండుతాయి.పంటలు పండితే మద్దతు ధర ఇవ్వాలి.మద్దతు ధర ఇస్తే మళ్లీ బోనస్ ఇవ్వాలి. ఇదంతా ఎందుకని నీళ్లు ఇవ్వడం లేదు. రాష్ట్రాన్ని నడిపే వ్యక్తి మంచి బుద్ధి కలిగిన వాడు ఉంటే, రాష్ట్రంలో పేదలు, పెద్దలు, హమాలీలు, మిల్లు యజమానులు అందరూ సంతోషంగా ఉంటారు. పది సంవత్సరాల కేసీఆర్ హయాంలో మనం అదే చూసాం రైతులు బాగున్నారు, పారిశ్రామికవేత్తలు బాగున్నారు, హమాలీలు బాగున్నారు, అందరూ బాగున్నారు.'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.

### బీఆర్ఎస్‌పై ప్రజల్లో మమకారం పోలేదు

'బీఆర్ఎస్ ప్రభుత్వానికి అధికారం లేకపోయినప్పటికీ ప్రజల్లో మమకారం మాత్రం పోలేదు. ఈ కష్ట సమయంలో ఎవరైతే బీఆర్ఎస్ పార్టీకి అండదండగా ఉన్నారో వారందరినీ కాపాడుకుంటాం. ఈరోజు 18వ మహాసభలు జరుపుకుంటూ మమ్మల్ని ఆహ్వానించిన హమాలీ సోదరులకు ధన్యవాదాలు. మా గుండెల్లో కేసీఆర్‌ను పెట్టుకున్నామని, మీరు ఇక్కడికి రావాలని పిలిచిన హమాలీ కార్మికులకు కృతజ్ఞతలు'అని కేటీఆర్ చెప్పుకొచ్చారు.

'మీ రుణం ఖచ్చితంగా తీర్చుకుంటానని మరియు మీ ప్రతి సమస్యను తీర్చే బాధ్యత నాదేనని నేను వెల్లడిస్తున్నాను. మీరంతా ఐకమత్యంగా మరియు గట్టిగా ఉండాలని కోరుతున్నాను. ఇంకా రెండు సంవత్సరాల్లో ఖచ్చితంగా కేసీఆర్‌ని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం. ఏ చిన్న సమస్యలు ఉన్నా తప్పకుండా పరిష్కరించుకుందామని మీ అందరికీ తెలియజేస్తున్నాను.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు క్యామ మల్లేష్, హమాలీ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాళేశ్వరం అవినీతిపై రేవంత్ రెడ్డి మౌనమెందుకు.?

పూలమాలలు వేసి అంజలి ఘటించారు. దేశ సమైక్యత కోసం ముఖర్జీ చేసిన త్యాగాలు మరువలేనివని ఈ సందర్భంగా నేతలు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పొలిటికల్ డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. జాతీయ డ్యాం భద్రతా సంస్థ హెచ్చరించినా మరమ్మతులు చేపట్టకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకుంటే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఆ అవినీతిపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని నిలదీశారు. మరోవైపు హైడ్రా కూల్చివేతల తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. హైడ్రా కేవలం పేదల ఇళ్లను టార్గెట్ చేస్తోందని ఎంఐఎం నేతలకు చెందిన ఫాతిమా విద్యాసంస్థల అక్రమ కట్టడాలపై కోర్టులు తప్పుబట్టినా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్-ఎంఐఎం దోస్తీ వల్లే ఈ పక్షపాతమని హైడ్రా అందరికీ ఒకే చట్టాన్ని వర్తింపజేయాలని, లేనిపక్షంలో విపక్షాల అక్రమాలపై రాష్ట్రవ్యాప్త పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.

# బీజేపీ నేతలు రాముడి హుండీలోని సొమ్మును కూడా లూటీ చేశారు

శ్రీరాముడి పేరును, అక్షింతలను అడ్డం పెట్టుకుని ఇళ్ల వెంట తిరిగి విరాళాలు వసూలు చేశారు. తీరా చూస్తే ఆ నిధుల్లోనే కోట్లాది రూపాయల అవినీతికి తెరలేపారు. దేవుడి హుండీలోని సొమ్మును సైతం లూటీ చేయడం దేశ ప్రజలందరినీ అవమానించడమే" అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నేతల అసలు రంగును, వారి అవినీతి అక్రమాలను అక్కడి స్థానిక ప్రజలు ముందే గుర్తించారని అందుకే అయోధ్య పరిధిలోని లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థిని అక్కడి ఓటర్లు ఓడించి బుద్ధి చెప్పారని పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు. భక్తి వేరు, రాజకీయం వేరని స్పష్టం చేసిన మంత్రి ఈ విరాళాల కుంభకోణానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌లదే పూర్తి బాధ్యతని అన్నారు. దేవుడి పేరుతో సాగించిన ఈ పెద్ద స్కాంపై బీజేపీ తక్షణమే స్పందించాలని, దేశ ప్రజలందరికీ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. భక్తి ముసుగులో రాజకీయ వ్యాపారం చేసే శక్తులను ప్రజలు ఇకనైనా గుర్తించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

# గంగపుత్ర గజ ఈతగాళ్ల సేవలు సమాజానికి ఆదర్శం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందుపట్ల సునీల్ రెడ్డి
- ధైర్యసాహసాలతో ప్రాణాలకు తెగించి నీటిలో ఎదురీత
- సర్పంచ్ శ్రీనివాస్ గంగపుత్రకు సన్మానం
- గజ ఈతగాళ్ల బృందానికి ఆత్మీయ సత్కారం



**బెస్తపల్లి ( ప్రశ్న న్యూస్ )**పెద్దపల్లి జిల్లాలోని మంథని పట్టణం పరిధిలోని గోదావరిలో గత బుధవారం గల్లంతై మృతి చెందిన శ్రీపాద కాలనీకి చెందిన కొమురయ్య మృతదేహాన్ని తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి వెలికితీసి కుటుంబ సభ్యులకు అప్పగించిన గంగపుత్రుల అమూల్యమైన సేవలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా శనివారం బెస్తపల్లి గ్రామంలో గంగపుత్ర గజ ఈతగాళ్లతో పాటు గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గంగపుత్రను ఆయన శాలువాలతో సన్మానించి వారి సేవలను కొనియాడారు.

### తమ ప్రాణాలను లెక్కచేయని గంగపుత్రుల సేవలు భేష్..

చందుపట్ల సునీల్ రెడ్డి మాట్లాడుతూ ప్రమాద సమయంలో నదిలో నీటి లోతు అధికంగా ఉన్నా, తమ ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉన్నా ఆపద అని పిలిస్తే, ఏమాత్రం వెనుకాడకుండా మానవత్వంతో స్పందించి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన గంగపుత్రులు సమాజానికి ఆదర్శప్రాయులని అన్నారు.

### గంగపుత్రుల ధైర్యసాహసాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి..

మత్స్యకారుల సేవా తత్పరత, ధైర్యసాహసాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను ప్రభుత్వం, సమాజం గుర్తించి ప్రోత్సహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మంథని మండల అధ్యక్షుడు వీరబోయిన రాజేందర్, కొండ్రు లక్ష్మణ్, వార్డు సభ్యుడు కంచు మల్లేష్, తోట్ల రాజు, బొరె తిరుపతి, బొరె రాజేశం, ధర్మాజీ రాజేందర్, మహేష్, సందీప్, గుమ్మడి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం

- పూర్వ విద్యార్థులు - విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, విలాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్రాక్‌సూట్లు, షూలు, క్రీడా సామగ్రిని పంపిణీ చేయడంతో పాటు పాఠశాల ఆవరణలో పండ్ల మొక్కలు నాటారు. గ్రామ పాలకవర్గం ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌ను సర్పంచ్ ఏనుగుల కనకయ్య, ఉపసర్పంచ్ పొత్తూరి శైలజ ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు బొలుగం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మారం జగదీశ్వర్, ముదుగంటి సురేందర్ రెడ్డి, డాక్టర్ ఆడెపు జయరాం, డాక్టర్ సత్యనారాయణ, మారం స్వదేశ్ కుమార్ పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం కొనసాగిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో దమ్మ వెంకటరమణ, జోగు శంకర్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అజ్ఞానాన్ని తొలగించే ఆధ్యాత్మిక క్షేత్రం

**- గుంటూరు జిల్లా కాకాని శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయం**





**గుంటూరు (ప్రశ్న న్యూస్)** గుంటూరు జిల్లాలోని కాకాని గ్రామంలో వెలసిన శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానం శైవ భక్తులకు అత్యంత పవిత్రమైన క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. చారిత్రక వైభవం, పురాణ ప్రాశస్త్యం, విశిష్ట ఆచారాలు, అద్భుతమైన అజ్ఞాన బావి, శక్తివంతమైన మూలవిరాట్, విశేషమైన రాహు--కేతు పూజలతో ఈ ఆలయం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది.

### చారిత్రక నేపథ్యం..

స్థానిక స్థలపురాణాల ప్రకారం ఈ క్షేత్రం అనేక శతాబ్దాల చరిత్రను కలిగి ఉంది. ప్రాచీన కాలంలో ఋషులు, సిద్ధులు ఈ ప్రాంతంలో తపస్సు చేసినట్లు విశ్వసిస్తారు. అనంతరం వివిధ రాజవంశాల పాలనలో ఆలయం అభివృద్ధి చెంది, నేటికీ శైవ సంప్రదాయానికి ప్రతీకగా నిలిచింది. కాలక్రమేణా అనేక పునర్నిర్మాణాలు జరిగినప్పటికీ, ఆలయ ఆధ్యాత్మిక మహిమ మాత్రం యథాతథంగా కొనసాగుతోంది.

### మూలవిరాట్ విశిష్టత..

ఈ ఆలయంలోని శ్రీ మల్లేశ్వరస్వామి స్వయంభూ శివలింగ స్వరూపంగా భక్తులచే ఆరాధించబడుతున్నారు. గంగా పార్వతీ సమేతంగా కొలువై ఉన్న స్వామివారిని దర్శించుకుంటే ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, కుటుంబ సౌఖ్యం, మనశ్శాంతి కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఆలయంలోని ప్రశాంత వాతావరణం ప్రతి భక్తునిలో భక్తి భావాన్ని పెంపొందిస్తుంది.

### అజ్ఞాన బావి -- ఆధ్యాత్మిక విశిష్టత

కాకాని ఆలయంలో అత్యంత విశిష్టమైన ప్రదేశం అజ్ఞాన బావి. ఈ బావి నీటికి పవిత్రతతో పాటు ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉందని స్థానిక విశ్వాసం. భక్తులు ఈ బావిని దర్శించి, దాని తీర్థాన్ని స్వీకరిస్తే అజ్ఞానం తొలగి జ్ఞానం, వివేకం, ఆత్మవిశ్వాసం కలుగుతాయని నమ్మకం. అందుకే దీనిని "అజ్ఞానాన్ని తొలగించే బావి"గా భక్తులు గౌరవిస్తారు.

### రాహు--కేతు పూజల విశిష్టత

ఈ క్షేత్రంలో నిర్వహించే రాహు--కేతు శాంతి పూజలు ఎంతో ప్రసిద్ధి చెందాయి. రాహు--కేతు దోషాలు, కాలసర్ప దోషం, వివాహ ఆలస్యం, సంతాన సమస్యలు, ఉద్యోగ--వ్యాపార ఆటంకాలు తొలగాలని కోరుకునే భక్తులు పెద్ద సంఖ్యలో ఈ పూజలు నిర్వహిస్తారు. శాస్త్రోక్తంగా జరిగే ఈ పూజల అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు చేయడం ఆనవాయితీ.

### ప్రధాన పర్వదినాలు -- విశేష ఉత్సవాలు

ఈ ఆలయంలో సంవత్సరమంతా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించబడతాయి. మహా శివరాత్రి సందర్భంగా అఖండ అభిషేకాలు, రుద్రాభిషేకాలు, జాగరణ, కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా జరుగుతాయి. కార్తీక మాసంలో దీపోత్సవాలు, ప్రత్యేక పూజలు, రుద్రపారాయణాలు నిర్వహిస్తారు. ప్రతి సోమవారం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, బిల్వార్చనలు జరుగుతాయి. ప్రదోష కాలంలో శివారాధనకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. శ్రావణ మాసం, కార్తీక పౌర్ణమి సందర్భంగా వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు.

### భక్తుల విశ్వాసం

కాకాని శ్రీ మల్లేశ్వరస్వామిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటే కుటుంబ శాంతి, ఆరోగ్యం, సంతాన సౌభాగ్యం, విద్యాభివృద్ధి, ఉద్యోగ విజయాలు, గ్రహదోష నివారణ కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. ముఖ్యంగా అజ్ఞాన బావి దర్శనం, రాహు--కేతు పూజలు ఈ క్షేత్రానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. గుంటూరు జిల్లా కాకాని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానం కేవలం ఒక ఆలయం మాత్రమే కాదు; భక్తుల విశ్వాసానికి, శైవ సంప్రదాయానికి, ఆధ్యాత్మిక ప్రశాంతతకు ప్రతీక. చారిత్రక వారసత్వం, స్వయంభూ మూలవిరాట్, అజ్ఞాన బావి, రాహు--కేతు శాంతి పూజలు, మహా శివరాత్రి వైభవం వంటి విశిష్టతలతో ఈ క్షేత్రం నిత్యం భక్తులను ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తోంది

# రేషన్ దుకాణాలే 'మీ మార్ట్'లు

## ప్రత్తిపాడులో రాష్ట్ర తొలి పైలట్‌కు శ్రీకారం

**లాల్‌పురంలో మంత్రి నాదెండ్ల మనోహర్,**

**ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు**

**మార్కెట్ ధరల కంటే రూ.3-4 తక్కువకే నిత్యావసర వస్తువులు**



ప్రత్తిపాడు(ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో రేషన్ దుకాణాలను ప్రజలకు మరింత ఉపయోగకరంగా మార్చే దిశగా కూటమి ప్రభుత్వం చేపట్టిన 'మీ మార్ట్' కార్యక్రమానికి ఆదివారం ప్రత్తిపాడు నియోజకవర్గంలోని గుంటూరు రూరల్ మండలం లాల్‌పురంలో శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్తో కలిసి ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు రాష్ట్రంలోని తొలి పైలట్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రికి కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విడతల వారీగా వెయ్యి 'మినీ మార్ట్'లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందులో భాగంగా ప్రత్తిపాడు నియోజకవర్గంలోనే ఏడు మార్ట్‌లను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన నిత్యావసర వస్తువులను మార్కెట్ ధరల కంటే రూ.3 నుంచి రూ.4 తక్కువ ధరకే అందించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాల నిర్మాణమే కాదని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడే ప్రతి సంక్షేమ కార్యక్రమం కూడా అభివృద్ధిలో భాగమేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి పాలన, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజాకేంద్రిత ఆలోచనలతో రాష్ట్రంలో అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధికి కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో తొలి 'మీ మార్ట్' పైలట్ ప్రాజెక్టును ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రారంభించినందుకు మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

బంజారాహిల్స్ లోని కళింగ కల్చరల్ సెంటర్లో ఏర్పాటైన జాతీయ చేనేత వస్త్రప్రదర్శ సోషలైట్ యెనుగు శైలజారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఇక్కడి హాల్లో కొలువుదీరిన చేనేతకారుల వస్త్ర ఉత్పత్తులను తిలకిస్తూ చేనేతకారులతో వాటి తయారీ విధానం, ప్రత్యేకత తెలుసుకుంటూ కలివిడిగా తిరిగారు. చేనేత ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదని, నేటితరం యువతకూడా హ్యాండ్లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని శైలజారెడ్డి అన్నారు. నిర్వాహకులు జయేష్రుప్తా మాట్లాడుతూ..ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతున్న ఈ ప్రదర్శన దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, చేతిపని బృందాలు తమ సిల్క్ హ్యాండ్లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 74 వేల రకాల వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.

# రాయలసీమకు హార్టికల్చర్ బూస్ట్

**- అమరావతి--విశాఖ--తిరుపతితో ఏపీ గ్రోత్ ట్రయాంగిల్!**

**- 6 నెలల్లో మూడు ఎకనామిక్ రీజియన్ల మాస్టర్ ప్లాన్..**

**- వైజాగ్ బే సిటీ, స్పోర్ట్స్ సిటీలు, జిల్లా ఎకనామిక్ ప్రొఫైల్స్‌కు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్**

**అమరావతి(ప్రశ్న న్యూస్)** రాష్ట్ర వనరులను సమర్థంగా వినియోగిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. విశాఖ, అమరావతి, తిరుపతిని కేంద్రాలుగా చేసుకుని మూడు ఎకనామిక్ రీజియన్ల అభివృద్ధికి కార్యాచరణను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఖరారు చేశారు. ఆరు నెలల్లో అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల మాస్టర్ ప్లాన్లను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ముసాయిదా సిద్ధమైన తర్వాత ప్రజలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకుని తుది ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సచివాలయంలో సోమవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రతి జిల్లాకు రెండు నెలల్లో డిస్ట్రిక్ట్ ఎకనామిక్ ప్రొఫైల్ సిద్ధం చేయాలని, స్థానిక వనరులకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.ద

### లింగాల మోడల్‌తో రాయలసీమకు కొత్త దిశ

కడప జిల్లా లింగాల మండలంలో ఉద్యాన పంటలతో సాధించిన తలసరి ఆదాయం రాష్ట్రానికే ఆదర్శమని సీఎం పేర్కొన్నారు. ఒక్క మండలంలోనే రూ.7.30 లక్షల తలసరి ఆదాయం నమోదు కావడం హార్టికల్చర్ శక్తికి నిదర్శనమన్నారు. ఇదే నమూనాను రాయలసీమ అంతటా విస్తరించి



ప్రపంచ స్థాయి హార్టికల్చర్ హబ్గా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను పెద్దఎత్తున తీసుకురావడం ద్వారా రైతుల ఆదాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో గుణాత్మక మార్పు వస్తుందన్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి మూడు ఎకనామిక్ రీజియన్ల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి సృష్టి, వనరుల సద్వినియోగమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన వెల్లడించారు.

# ఏపీలో షూఆల్స్ ఆర్ & డీ, ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటుచేయండి

**- ఆంధ్రప్రదేశ్‌లో పాదరక్షల యూనిట్ పనులు వేగవంతం చేయండి**

**- షూఆల్స్ సంస్థ ఛైర్మన్ లీ చియాంగ్-గెన్‌తో మంత్రి లోకేష్ భేటీ**

సియోల్ (సౌత్ కొరియా): దక్షిణ కొరియాకు చెందిన ప్రఖ్యాత మెడికల్ డివైస్ సర్టిఫైడ్ స్మార్ట్ హెల్త్‌కేర్ ఫుట్‌వేర్ సంస్థ షూఆల్స్ (గ్రాప్రనీవజీశ్రీశ్రీబ) కంపెనీ లిమిటెడ్ ఛైర్మన్ ఁ సీఈవో లీ చియాంగ్-గెన్ (ఓతీ. ఒవవ అష్ట్రవనీనిణ-ణవబీని)తో ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్‌లో భేటీ అయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... షూఆల్స్ సంస్థ ప్రభుత్వంతో చేసుకున్న ఎంవోయూ (ఓనీజ) మేరకు ఆంధ్రప్రదేశ్‌లో పాదరక్షల తయారీ యూనిట్ పనులను వేగంగా ప్రారంభించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రూ.300 కోట్లతో ఏర్పాటు కానున్న ఈ యూనిట్ ద్వారా సుమారు 3 వేల మందికి ఉపాధి లభించనుందన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఆర్ ఁ డీ (ఖీడఆ), ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటుచేసి, ఏపీని రిటైల్, డిస్ట్రిబ్యూషన్ హబ్‌గా మార్చాలని కోరారు. షూఆల్స్ సంస్థ ఛైర్మన్ లీ చియాంగ్-గెన్ మాట్లాడుతూ... మాగ్నెటిక్ థెరపీ, షాక్ అబ్సార్షన్, కూలింగ్ సోల్స్, యాంటీ బాక్టీరియల్ మెటీరియల్స్ ఏకీకరణతో ఓఈఊ-సర్టిఫైడ్ మెడికల్ ఫుట్‌వేర్ తయారీలో తమ సంస్థ ప్రత్యేకత కలిగి ఉందని చెప్పారు. సియోల్ నేషనల్ యూనివర్సిటీ, ఈవా ఉమెన్స్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్‌తో కలిసి ంఎ స్మార్ట్ మెడికల్ ఫుట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని ఛైర్మన్ లీ చియాంగ్-గెన్ అన్నారు.

# బాబూ జగ్జీవన్ రాం

## ఆశయాలు స్ఫూర్తిదాయకం

**- ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కమిటీ జిల్లా సభ్యులు, బోయినపల్లి సెస్ డైరెక్టర్ : కొట్టెపల్లి సుధాకర్**




**సిరిసిల్ల / బోయినపల్లి (ప్రశ్న న్యూస్)** భారత మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబూ జగ్జీవన్ రాం వర్ధంతిని పురస్కరించుకొని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ జిల్లా సభ్యులు, బోయినపల్లి సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్ సోమవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కొట్టెపల్లి సుధాకర్ మాట్లాడుతూ, బాబూ జగ్జీవన్ రాం దేశ రాజకీయాల్లో, సామాజిక న్యాయం కోసం విశేష కృషి చేసిన గొప్ప నాయకుడని అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని, సమానత్వ సమాజ నిర్మాణానికి ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాబూ జగ్జీవన్ రాం ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సామాజిక సమానత్వం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఉపాధి దిశగా మహిళలకు అండగా: మదర్ తెరిస్సా ట్రస్ట్

**- 48 మందికి ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ**

**- మహిళా సాధికారతకు కృషి ప్రశంసనీయం**





మైలవరం(ప్రశ్న న్యూస్)మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా పనిచేస్తున్న మదర్ తెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ మరోసారి తన సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలిచింది. ట్రస్ట్ వ్యవస్థాపకురాలు కోయ సుధా ఆధ్వర్యంలో నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న 48 మంది మహిళలకు సోమవారం ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. మైలవరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి సబ్‌రిజిస్ట్రార్ యార్లగడ్డ వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వంశీకృష్ణ మాట్లాడుతూ మహిళల సాధికారత, స్వయం ఉపాధి కోసం మదర్ తెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ట్రస్ట్ అందిస్తున్న శిక్షణ, ఉపాధి అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. టైలరింగ్ ద్వారా ఉపాధితో పాటు వ్యాపార అవకాశాలను కూడా కల్పిస్తూ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా ట్రస్ట్ చేస్తున్న కృషి సమాజానికి ఆదర్శమని కొనియాడారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆశాజ్యోతి (యూఎస్ఏ), పాలడుగు వంశీకృష్ణ, శ్రీపద్మ తదితర దాతల సహకారంతో ఇప్పటివరకు వేలాది మంది మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణతో పాటు కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇలాంటి కార్యక్రమాలు మరింత దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, జూలూరి రాము, కోయ శ్రీనివాస్, ట్రస్ట్ సభ్యులు ద్రోవవల్లి విజయలక్ష్మి, ఉష, షహెద, వెంకటేష్ పాల్గొన్నారు

# జూలై 17, 18, 19 తేదీల్లో బాగేశ్వర్ సర్కార్ శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి దివ్య దర్బార్

**హైదరాబాద్ :** జూలై 17, 18, 19 తేదీల్లో బాగేశ్వర్ సర్కార్ శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి దివ్య దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా భక్తుల కోసం మూడు రోజుల పాటు శ్రీ హనుమాన్ కథ ఉంటుంది. హైదరాబాద్‌లో తొలిసారి బాగేశ్వర్ సర్కార్ శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి కార్యక్రమం నిర్వహించనున్నారు.

బాగేశ్వర్ సర్కార్ శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి తొలిసారిగా హైదరాబాద్‌లో నిర్వహించనున్న మూడు రోజుల కార్యక్రమాల కోసం సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించిన బ్రోచర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నిర్వాహకులు అంజనీ కుమార్ అగర్వాల్, సూర్య కమల్ గుప్తా, సంజయ్ అగర్వాల్, రాకేష్ జలాన్, రాకేష్ నర్సింగ్‌పురియా, సందీప్ మిత్తల్, ఘనశ్యామ్ అగర్వాల్, నవీన్ అగర్వాల్, పవన్ తిబ్రేవాల్, అంకిత్ అగర్వాల్, ధీరజ్ అగర్వాల్, రూపేష్ అగర్వాల్, శుభమ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలు జూలై 17, 18, 19 తేదీలలో గగన్ పహాడ్‌లోని పురాన్ సన్స్ ఫార్మ్స్ (ప్రెస్టీజ్ సిటీ గేట్ ఎదురుగా) జరగనున్నాయి.

ఈ మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని హైదరాబాద్ బాగేశ్వర్ ధామ్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్వచ్ఛంద సేవకుల సమావేశంలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు పాటించాల్సిన నియమాలు, సేవా విధానాలు, బాధ్యతల గురించి వారికి విపులంగా వివరించారు. పురాన్ సన్స్ ఫార్మ్స్‌లో పండిత్ సంజయ్ శర్మ ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం వైభవంగా జరిగింది.

అనంతరం జరిగిన స్వచ్ఛంద సేవకుల సమావేశంలో కన్వీనర్ అంజనీ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఇంతటి భారీ స్థాయిలో ఈ తరహా ఆధ్యాత్మిక కార్యక్రమం తొలిసారిగా నిర్వహించబడుతోందన్నారు. అందరూ సమష్టిగా కృషి చేసి ఈ కార్యక్రమాన్ని చారిత్రాత్మక విజయంగా నిలపాలని ఆయన పిలుపునిచ్చారు. బాగేశ్వర్ ధామ్ నుంచి 60 మంది సభ్యుల బృందం, అలాగే ఇతర ప్రాంతాల నుంచి 500 మంది రానున్నారని, వారికి వసతి, భోజన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. జూలై 16 నుంచి 19 వరకు స్వచ్ఛంద సేవకులు విధుల్లో ఉండాలని సూచించారు. సేవలందించిన ప్రతి స్వచ్ఛంద సేవకునికి 'బాబా' తరపున ప్రత్యేక ప్రశంసాపత్రం (సర్టిఫికేట్) అందిస్తామన్నారు.

# జాతీయవాదానికి డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు చిరస్మరణీయం

**- బీజేపీ మండలాధ్యక్షులు : ఎడపల్లి పరశురాం**

**- బోయినిపల్లిలో బీజేపీ నేతల ఆధ్వర్యంలో ఘనంగా ముఖర్జీ జయంతి**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా సోమవారం బోయినిపల్లి మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్ మాట్లాడుతూ దేశ సమైక్యత, జాతీయవాదానికి డా. ముఖర్జీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి కార్యకర్త ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఉదారి నరసింహాచారి, మాజీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు రాజేంద్ర ప్రసాద్, మెరుపుల గంగాధర్ గౌడ్, ఉపాధ్యక్షులు ఇల్లందుల బాలయ్య, పసికంటి వెంకటేశం, కిసాన్ మోర్చా అధ్యక్షుడు జువ్వెంతుల శ్రీనివాసరెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సుంకపాక ప్రభు, సీనియర్ నాయకులు స్వామి కుమార్, బోగోజి గంగాధర్ చారి, సారంపల్లి రాజు, కొనుకటి హరీష్, ఆవుల లక్ష్మణ్, శ్రావణ్, పెల్లి అనిల్ కుమార్, చంద్రయ్య, వెంకటేష్, కల్యాణ్ అనిల్, సిరికొండ ప్రసాద్, ఎడపల్లి ధర్మేంద్ర, కార్తీక్, రామానుజన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ స్థాయి వైద్య సేవల దిశగా మెడిసిటీకి మరో ఘనత

**ఘన్‌పూర్ మెడిసిటీ హాస్పిటల్స్‌కు ప్రతిష్ఠాత్మక (ఎన్ ఏ బి హెచ్ ) అక్రిడిటేషన్**

**జూలై 7న విలేకరుల సమావేశం**




మేడ్చల్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ స్థాయి వైద్య సేవలను ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న మెడిసిటీ మెడికల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎం ఇ ఎం ఎస్) ఆధ్వర్యంలోని మెడిసిటీ హాస్పిటల్స్, ఘన్‌పూర్ ప్రతిష్ఠాత్మక (ఎన్ ఏ బి హెచ్) అక్రిడిటేషన్‌ను పొందింది. ఈ గుర్తింపు ద్వారా ఆధునిక వైద్య సాంకేతికత, నాణ్యమైన వైద్య సేవలు, రోగుల భద్రత, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వైద్య సేవల అందింపులో మెడిసిటీ నిబద్ధత మరోసారి రుజువైంది. (ఎన్ ఏ బి హెచ్ )గుర్తింపు పొందిన దేశంలోని అతి కొద్ది మెడికల్ కాలేజీ హాస్పిటల్స్‌లో మెడిసిటీ మెడికల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఒకటిగా నిలవడం విశేషం.
ఈ సందర్భంగా వైద్య మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునిక చికిత్సా సౌకర్యాలు, (ఎన్ ఏ బి హెచ్ )గుర్తింపు సాధనలో చేపట్టిన చర్యలపై వివరాలు వెల్లడించేందుకు జూలై 7 (మంగళవారం) ఉదయం 10:30 గంటలకు ఘన్‌పూర్‌లోని మెడిసిటీ మెడికల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ కె. శివరామకృష్ణ (అధ్యక్షులు, )(ఎం ఇ ఎం ఎస్ )శ్రీ ఇనీష్ మర్చంట్ (సి ఇ ఓ మెడిసిటీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్), డా. దేవేంద్ర సింగ్ నేగి (ప్రిన్సిపాల్, (ఎం ఇ ఎం ఎస్ ), డా. గీత (డైరెక్టర్ – – మెడికల్ సర్వీసెస్, మెడిసిటీ హాస్పిటల్స్, ఘన్‌పూర్)తో పాటు( ఎం ఇ ఎం ఎస్) , మెడిసిటీ హాస్పిటల్స్‌కు చెందిన ఇతర అధికారులు పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ విలేకరుల సమావేశానికి మీడియా ప్రతినిధులు, ఫొటోగ్రాఫర్లు, కెమెరామెన్‌లు హాజరై కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్వాహకులు కోరారు.

# హనుమంత వాహనంపై భక్తులకు శ్రీ సుందరరాజస్వామివారు అభయ దర్శనం

**నేడు గరుడ వాహనంపై దివ్య మంగళ విహారం**



తిరుపతి(ప్రశ్న న్యూస్) తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ సుందరరాజస్వామివారి అవతార మహోత్సవాలు ఆధ్యాత్మిక వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం రాత్రి శ్రీ సుందరరాజస్వామివారు హనుమంత వాహనాన్ని అధిరోహించి ఆలయ నాలుగు మాడవీధుల్లో దివ్య మంగళ విహారం చేస్తూ భక్తులకు అభయప్రదమైన దర్శనం ఇచ్చి అనుగ్రహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు సహస్రనామార్చనను నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ సుందరరాజస్వామివారికి పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీరు, పసుపు, చందనం తదితర పవిత్ర ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా మహాభిషేకం నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్ సేవను వైభవంగా నిర్వహించిన అనంతరం, హనుమంత వాహనంపై సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. వేదఘోషలు, మంగళ వాయిద్యాల నడుమ జరిగిన ఈ వాహనసేవను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి దివ్య దర్శనం పొందారు. అవతార మహోత్సవాల చివరి రోజైన మంగళవారం రాత్రి శ్రీ సుందరరాజస్వామివారు గరుడ వాహనాన్ని అధిరోహించి ఆలయ నాలుగు మాడవీధుల్లో దివ్య మంగళ విహారం చేసి భక్తులను అనుగ్రహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, అర్చకులు, ఆలయ అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ అవతార మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగుతున్నాయి.

## ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడకుల అశోక్ తో

# ప్రజా ప్రశ్న స్టాఫ్ రిపోర్టర్ ముఖ ముఖి

**పదవి కోసం కాదు, ప్రజల కోసం బతుకుతున్నా" - పైడకుల అశోక్**




**ములుగు(ప్రశ్న న్యూస్)** ములుగు జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ, అనేక ఆరోపణల మధ్య కూడా నిబద్ధతగా పనిచేస్తున్న జిల్లా అధ్యక్షుడు పైడకుల అశోక్ తో మా స్టాఫ్ రిపోర్టర్ ప్రత్యేకంగా ముఖాముఖి మాట్లాడారు. పార్టీ కార్యక్రమాలు, ఆరోపణలు, భవిష్యత్ అజెండాపై ఆయన సూటిగా స్పందించారు.

**ప్రశ్న: ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా చేసిన 3 ప్రధాన పనులు ఏమిటి.?**

పైడకుల అశోక్: మూడు ప్రధాన అంశాలు చెప్పగలను.

మొదటిది, పార్టీని గ్రామ స్థాయి వరకు బలోపేతం చేయడం. ప్రతి మండలంలో కమిటీలు వేసి, ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌కు కొత్త రక్తం ఇచ్చాం.
రెండోది, కోవిడ్, వరదల సమయంలో ప్రజల పక్కన నిలబడడం. జెండా కాదు, అన్నం పెట్టే పని చేశాం.
మూడోది, సీతక్క అక్క ఆదర్శాలతో గిరిజన, ఆదివాసీ తండాల్లో కాంగ్రెస్‌ను చేరువ చేయడం. ములుగు అంటే కాంగ్రెస్ కంచుకోట అని మళ్ళీ నిరూపించాం.

**ప్రశ్న: మంత్రి సీతక్క అక్క ఇచ్చిన అతి పెద్ద సందేశం ఏమిటి.?**

పైడకుల అశోక్: అక్క ఒక్క మాటే చెప్పింది అన్నా: "తమ్ముడు, పదవి కోసం కాదు, ప్రజల కోసం బతుకు". ప్రజలే దేవుళ్ళు అన్న ఆమె మార్గమే నా దారి. తండాలో పేదోడి ఇంట్లో కూర్చుని కష్టం వినడం, కార్యకర్త ఫోన్ ఎత్తగానే పరుగున వెళ్లడం, అదే నా రాజకీయం.

**ప్రశ్న: కార్యకర్తల్లో జోష్ నింపే భరోసా ఏంటి.?**

పైడకుల అశోక్: కార్యకర్తల్లారా, భయపడొద్దు. కష్టకాలంలో పారిపోయేది నాయకుడు కాదు, నిలబడేదే నాయకుడు. మీ వెన్నంటి నేను, మీ తలమీద సీతక్క అక్క ఆశీర్వాదం ఉంది. కాంగ్రెస్ జెండా దింపేది లేదు. మన ప్రభుత్వం వచ్చింది, ఇప్పుడు మనం పనిచేసే టైం.

**ప్రశ్న: ఇసుక ఆరోపణలు - ఇది కుట్ర అంటారా.?**

పైడకుల అశోక్: నా మీద ఆరోపణ వచ్చింది అంటే కాంగ్రెస్ బలంగా ఉందని అర్థం. ఆధారాలు లేవు, రుజువులు లేవు, కేవలం కాగితాల మీద బురద. ఇది పార్టీని బలహీనపరచడానికి ప్రతిపక్షాలు చేస్తున్న రాజకీయ కుట్ర. ప్రజలకు అర్థమవుతుంది ఎవరు నిజాయితీగా పనిచేస్తున్నారో. ఏ పేరు చెప్పారు? ఏ ట్రక్కు నాది? ఏ బిల్లు నా దగ్గర ఉంది? ఒక ఆధారం చూపించండి. పేర్లు లేకుండా, ఫోటోలు లేకుండా మాట్లాడితే అది రాజకీయం, నిజం కాదు. నా మీద 1 రూపాయి అక్రమం ఉంటే నేనే రాజీనామా చేస్తా.

**ప్రశ్న: విచారణకు రెడీ అనడం యువతకు స్ఫూర్తా.?**

పైడకుల అశోక్: ఖచ్చితంగా. దోషి అయితే దాక్కుంటాడు. నేను విచారణకు రెడీ అన్నాను అంటే నా చేతులు శుభ్రం అని అర్థం. యువ కార్యకర్తలకు నేను చెప్పేది ఒకటే: నిజాయితీగా ఉండు, తలెత్తుకుని తిరుగు.

**ప్రశ్న: ఆస్తులు, బ్యాంక్ లావాదేవీలు బహిరంగంగా ఉన్నాయా.?**

పైడకుల అశోక్: నేను ఎన్నికల అఫిడవిట్‌లో అన్నీ ఇచ్చాను. 2023లో 1.80 కోట్ల ఆస్తులు, అన్నీ చట్టబద్ధం. ఐటీ రిటర్న్స్, ప్యాన్ అంతా పబ్లిక్ డొమైన్‌లో ఉంది. దాచింది ఏమీ లేదు. ప్రతిపక్షాలు కావాలంటే చూసుకోవచ్చు.

**ప్రశ్న: 2026-27 అజెండా - గిరిజన, యువత, రైతు ప్లాన్ ఏమిటి.?**

పైడకుల అశోక్: మా 3 లక్ష్యాలు క్లియర్. పోడు భూముల పట్టాలు, తండాల అభివృద్ధి ఫండ్స్ కోసం సీఎం దగ్గర నిలబడతా. ములుగులో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, ఉద్యోగ మేళాలు ఏర్పాటు చేస్తాం. సాగునీరు, ఎంఎస్పీ, రుణమాఫీ అమలు కోసం పార్టీ తరఫున గొంతు విప్పుతా.

**ప్రశ్న: పార్టీలో అందరినీ కలిపే ఫార్ములా ఏంటి.?**

పైడకుల అశోక్: అహం లేదు, అందరమూ అన్నదమ్ములమే అన్నా. సీనియర్ అయినా, కొత్త కార్యకర్త అయినా ఒకే టేబుల్ దగ్గర కూర్చోబెట్టి మాట్లాడతా. పదవులు కాదు, పార్టీ ముఖ్యం అని చెప్పి అందరినీ ఒక తాటి మీదకు తెస్తున్నా.

**ప్రశ్న: విమర్శలను ఎలా తీసుకుంటారు.?**

పైడకుల అశోక్: విమర్శ వస్తే నవ్వుతా అన్నా. బాణం వేసిన ప్రతిసారీ నేను ఇంకా గట్టిగా నిలబడతా. ఎందుకంటే నేను చేస్తున్న పని ప్రజల కోసం. విమర్శ నన్ను బలపరుస్తుంది, బద్దలు కొట్టదు.

**ప్రశ్న: యువతకు మీ సందేశం.?**

పైడకుల అశోక్: నిజాయితీగా ఉంటే చరిత్ర నిన్ను గుర్తుపెట్టుకుంటుంది, కుర్చీ కాదు. నేను చల్వాయి నుంచి ఎన్ఎస్‌యూఐ కార్యకర్తగా మొదలయ్యా. ఈరోజు డీసీ అధ్యక్షుడిని. పైరవీలు కాదు, ప్రజల నమ్మకమే నా బలం.

**ప్రశ్న: పదవికి రాజీనామా చేస్తారా.?**

పైడకుల అశోక్: ఎందుకు చేస్తా.? ఆరోపణ వచ్చిందని అమాయకుడు రాజీనామా చేయడు. రుజువు అయితేనే చేస్తా. నేను పారిపోయే మనిషిని కాదు. పార్టీ నన్ను నమ్మి మళ్ళీ బాధ్యత ఇచ్చింది. ఆ నమ్మకాన్ని నిలబెడతా.

**ప్రశ్న: సీతక్క అక్క పేరు దెబ్బతిందా.?**

పైడకుల అశోక్: అస్సలు కాదు. సీతక్క అక్క అవినీతి రహిత పాలన అంటారు. నేను కూడా అదే చేస్తున్నా. ఆరోపణలు రావడం వేరు, అవినీతి చేయడం వేరు. అక్కకు నా మీద పూర్తి నమ్మకం ఉంది. ఆమె పోరాటాన్ని నేను కొనసాగిస్తున్నా.

**ప్రశ్న: కుట్ర వెనుక ఎవరు ఉన్నారు? పేర్లు చెబుతారా.?**

పైడకుల అశోక్: బీఆర్ఎస్ నాయకులు, ఓడిపోయిన వాళ్లు. పేర్లు కూడా తెలుసు. కానీ నేను వాళ్ల స్థాయికి దిగి తిట్టను. నా పని పార్టీని బలపరచడం, వాళ్ల పని బురద చల్లడం. ప్రజలు తీర్పు ఇస్తారు.

**ప్రశ్న: ఇసుక మాఫియాతో సంబంధాలు ఉన్నాయా.? పదవిని అడ్డుపెట్టుకుని వ్యాపారాలు చేస్తున్నారా.?**

పైడకుల అశోక్: సున్నా శాతం సంబంధం లేదు. నా సన్నిహితులు అంటే కార్యకర్తలు. వాళ్ల పేర్లు బయటకు వస్తున్నాయి అంటే అది కూడా కుట్రలో భాగమే. కోర్టులో నిరూపించండి, నేను సిద్ధం. నేను వ్యాపారి కాదు. పూర్తి స్థాయి రాజకీయ కార్యకర్తని. నా ఆదాయం స్పష్టం. పదవిని ప్రజా సేవ కోసమే వాడాను, జేబు కోసం కాదు.

**ప్రశ్న: బహిరంగ సభలో వివరణ ఇస్తారా.? నైతిక బాధ్యత తీసుకుంటారా.?**

పైడకుల అశోక్:100% సిద్ధం. ప్రజల కోర్టే నాకు పెద్ద కోర్టు. ములుగులో ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ సభ పెట్టండి. నేను వచ్చి లెక్కలు చెబుతా. నైతిక బాధ్యత అంటే నిజం నిరూపించడం, పారిపోవడం కాదు. నేను తప్పు చేయలేదు కాబట్టి పదవిలోనే ఉండి పోరాడతా. క్లీన్ చిట్ వచ్చాక ప్రతిపక్షాలు క్షమాపణ చెప్పాలి.

**ప్రశ్న: కార్యకర్తల సమావేశం ఎప్పుడు.?**

పైడకుల అశోక్: ఈ నెలలోనే ములుగులో జిల్లా స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమావేశం పెడుతున్నా. ఎవరికైనా అనుమానం ఉంటే నా ముందు కూర్చుని అడగండి. దాచేది ఏమీ లేదు.

**చివరిగా ఒక్క మాట..**

పైడకుల అశోక్: ములుగు గడ్డ నన్ను చూసింది. నేను దొంగని కాదు. నిజం గెలుస్తుంది, కాంగ్రెస్ నిలబడుతుంది. ములుగు కాంగ్రెస్ కుటుంబానికి, సీతక్క అక్క అభిమానులకు నా మాట: "నేను బతికున్నంత కాలం ములుగులో కాంగ్రెస్ జెండా వాలదు. మీ తమ్ముడు మీ ముందు నిలబడతాడు".

# సిద్దిపేటలో జర్నలిస్టులకు మీడియా అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ

**- జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్) రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి మరియు ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. సోమవారం సిద్దిపేట ఐడీఓసీలో మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ కే హైమావతితో కలిసి జిల్లాలోని జర్నలిస్టులకు మీడియా అక్రిడిటేషన్ కార్డులను పంపిణీ చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. అలాగే జర్నలిస్టుల హెల్త్ కార్డులు అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మీడియా పోషించిన పాత్రను గుర్తు చేసిన మంత్రి, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందన్నారు.
ప్రభుత్వ పథకాల అమలులో లోపాలుంటే వాటిని నిర్మొహమాటంగా ఎత్తిచూపాలని, ప్రభుత్వం వాటిని సరిదిద్దుకుంటుందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టు లక్ష్మారెడ్డి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ తాను గతంలో జర్నలిస్టుగా పనిచేసిన అనుభవంతో మీడియా సమస్యలు బాగా తెలుసన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, హెల్త్ కార్డులు కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా సమర్థవంతంగా అమలయ్యేలా చూడాలని కోరారు.
జిల్లా కలెక్టర్ కే హైమావతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్, రూ. 10 లక్షల ఆరోగ్యశ్రీ, కొత్త రేషన్ కార్డులు, ప్రభుత్వ విద్య, వైద్యం బలోపేతం వంటి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపెల్లి చంద్రం, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్ఓ నాగరాజమ్మ, ఆర్డీవో సదానందం, డీపీఆర్ఓ రవికుమార్, ఐ అండ్ పీఆర్ అధికారులు, మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు, జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిపై జగన్ వ్యాఖ్యలు తుగ్లక్‌కే ఆశ్చర్యం కలిగించేలా ఉన్నాయి

**- లక్ష కోట్ల ఆదాయం తెచ్చే సెల్ఫ్ ఫైనాన్స్ రాజధానిగా**

**అమరావతిని తీర్చిదిద్దుతున్నాం: మంత్రి నిమ్మల రామానాయుడు**



పాలకొల్లు(ప్రశ్న న్యూస్) అమరావతి రాజధానిపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలు "పిచ్చి తుగ్లక్‌కే అసూయ, ఆశ్చర్యం కలిగించేలా ఉన్నాయని" రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. విషయ పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతున్న జగన్ గత ఐదేళ్లు రాష్ట్రాన్ని ఎలా పాలించారో ప్రజలు ఆశ్చర్యపోతున్నారని వ్యాఖ్యానించారు. సోమవారం పాలకొల్లు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజధాని అంశంపై ఎవరికివారు భిన్నమైన వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. ఒకరు విజయవాడే రాజధాని అంటుంటే, మరొకరు 30 రాజధానులు కావాలంటూ మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో అమరావతిని స్వాగతిస్తూ, 30 వేల ఎకరాల రాజధాని అవసరమని, తాను కూడా అక్కడే ఇల్లు నిర్మించుకుంటానని జగన్ అసెంబ్లీలో చెప్పారని మంత్రి గుర్తు చేశారు. అయితే 2019లో భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చి మూడు రాజధానుల ప్రతిపాదన తెచ్చారని, ఐదేళ్ల పాలనలో ఒక్క రాజధానిని కూడా పూర్తిగా అభివృద్ధి చేయలేకపోయారని విమర్శించారు. అప్పటికే నిర్మించిన అసెంబ్లీ, సచివాలయ భవనాల నుంచే పాలన కొనసాగించారని అన్నారు. కూటమి ప్రభుత్వం అమరావతిని దేశంలోనే ఆదర్శవంతమైన, లక్ష కోట్ల రూపాయల ఆదాయం తెచ్చే సెల్ఫ్ ఫైనాన్స్ రాజధానిగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. బెంగళూరు కర్ణాటకకు, చెన్నై తమిళనాడుకు, హైదరాబాద్ తెలంగాణకు ఆర్థిక ఇంజిన్‌గా నిలిచినట్లే, అమరావతి కూడా ఆంధ్రప్రదేశ్‌కు సంపద సృష్టించే కేంద్రంగా ఎదుగుతుందని చెప్పారు. ఈ అభివృద్ధి ద్వారా భారీగా పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి చరిత్రలో కోలుకోలేని పరాజయం ఇచ్చారని, కనీస ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా తీర్పు ఇచ్చిన తర్వాత ప్రజలపైనే జగన్ కక్ష పెంచుకున్నారని మంత్రి ఆరోపించారు. రాష్ట్రంలో విధ్వంసక రాజకీయాలకు వైఎస్సార్‌సీపీ తెరలేపిందని విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామ స్వరాజ్య లక్ష్యంతో పనిచేస్తున్నారని, మంత్రి నారా లోకేష్ విద్యారంగంలో వినూత్న మార్పులు తీసుకొస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారిస్తుంటే, ప్రతిపక్షం మాత్రం రాజకీయ ఆరోపణలతో కాలక్షేపం చేస్తోందని విమర్శించారు.

## వేములవాడ ప్రెస్ క్లబ్ అందరి జర్నలిస్టుల హక్కు

**- కలెక్టర్‌కు టీయూడబ్ల్యూజే (హెచ్-143) వినతి**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన వేములవాడ ప్రెస్ క్లబ్ భవనాన్ని గుర్తింపు పొందిన అన్ని జర్నలిస్టు సంఘాల సభ్యులు సమానంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ టీయూడబ్ల్యూజే (హెచ్-143) వేములవాడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కొలిపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ మాట్లాడుతూ, ప్రెస్ క్లబ్ భవనం జర్నలిస్టులందరి ఆస్తి అని, ఏ ఒక్క సంఘానికే పరిమితం చేయకుండా సమావేశాలు, శిక్షణ, సంక్షేమ కార్యక్రమాలకు అన్ని జర్నలిస్టు సంఘాలు వివక్ష లేకుండా వినియోగించుకునే అవకాశం కల్పించాలని కోరారు. జర్నలిస్టుల ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, సమానత్వం పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ సభ్యుడు జితేందర్, ఉపాధ్యక్షులు సిహెచ్. దేవరాజు, విష్ణు, జబ్బార్, పంపరి నాగరాజు, ఫాహద్, జిల్లా రమేష్, కముటాల విజయ్, చౌటుపల్లి వెంకటేష్, షబ్బీర్, ఇమ్రాన్, అజర్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా నిలిచిన బూరుగుపల్లి వార్డు సభ్యులు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి లత తీవ్ర క్యాన్సర్‌తో బాధపడుతూ సోమవారం ఉదయం మృతిచెందడంతో, ఆమె కుటుంబానికి గ్రామ వార్డు సభ్యులు రూ. 8,500 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య- మహేష్, ఉపసర్పంచ్ కల్లెపల్లి చంద్రయ్య, వార్డు సభ్యులు తూము గౌతమి- మహేష్, అక్కరాజు తిరుపతి, మ్యాన వర్షిత - వెంకటేష్, అతికం రాజశేఖర్ గౌడ్, కొలుపుల మల్లేశం, కల్లెపల్లి మమత, బరిగే రాధా - రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వర్గల్‌లో రోడ్డు దుస్థితిపై దీక్ష.. అధికారుల హామీతో విరమణ



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా వర్గల్ గ్రామంలో రహదారి పూర్తిగా గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో సోమవారం రోడ్డు నిర్మాణం కోసం నిరసన దీక్ష చేపట్టారు. దీక్ష విషయం తెలుసుకున్న గౌరారం ఎస్ఐ ఆరోగ్య, ఏఎస్ఐ పోచగౌడ్ సంఘటన స్థలానికి చేరుకుని నిరసనకారులతో చర్చించారు. అనంతరం సంబంధిత ఆర్‌డబీ ఈఈ, ఏఈ అధికారులు అక్కడికి చేరుకుని, దెబ్బతిన్న రహదారిని తక్షణమే మరమ్మతులు చేయడంతో పాటు, త్వరలోనే మొత్తం రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో గ్రామస్తులు తాత్కాలికంగా దీక్షను విరమించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, సమస్యపై వెంటనే స్పందించి గ్రామానికి వచ్చిన పోలీసు అధికారులు, గౌరారం ఎస్ఐ ఆరోగ్య, ఏఎస్ఐ పోచగౌడ్, అలాగే ఆర్‌డబీ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు ఇచ్చిన హామీ మేరకు పనులు చేపట్టకపోతే గ్రామస్థుల సహకారంతో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మొహ్సిన్, పారశురాం, లక్ష్మి, వెంకటేష్, టేకులపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ వేలూరు కిష్టారెడ్డి, నాగరాజు, స్వామి, కరుణాకర్, నవాజ్ హుసేన్, గోపాల్, నూక నవీన్, జంగీర్, సందీప్, భార్గవ్, సతీష్, శేఖర్, బ్రహ్మాచారి, బాలరాజాచారి, కృష్ణ, సత్తయ్య, రాజు, లింగం తదితరులు, సర్కార్ యూత్ సభ్యులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జీడీసీ మహిళా కళాశాలలో కృత్రిమ మేధస్సు ఘనంగా జన్మదిన వేడుకలు




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) జన్మదినోత్సవం సందర్భంగా "కృత్రిమ మేధస్సు చరిత్ర" అంశంపై ప్రత్యేక డాక్యుమెంటరీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన డాక్యుమెంటరీ ద్వారా 1956లో కృత్రిమ మేధస్సు ఆవిర్భావం నుంచి నేటి జనరేటివ్ కృత్రిమ మేధస్సు వరకు జరిగిన పరిణామాలు, విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, సమాచార సాంకేతిక రంగాల్లో కృత్రిమ మేధస్సు వినియోగం, భవిష్యత్ అవకాశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహాం మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు నేటి ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న అత్యంత కీలకమైన సాంకేతిక పరిజ్ఞానమని అన్నారు. విద్యార్థులు కృత్రిమ మేధస్సు నైపుణ్యాలను పెంపొందించుకొని భవిష్యత్‌లో లభించే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంప్యూటర్ సైన్స్ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ కె. సరోజ మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు చరిత్ర, దాని అభివృద్ధి, సమాజంపై చూపుతున్న ప్రభావం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సాంకేతికతను బాధ్యతాయుతంగా, నైతిక విలువలను పాటిస్తూ, సృజనాత్మకంగా వినియోగించుకోవాలని సూచించారు. కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు అన్వర్ మరియు స్వర్ణ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. డాక్యుమెంటరీ ప్రదర్శన అనంతరం విద్యార్థులతో పరస్పర చర్చ నిర్వహించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని కృత్రిమ మేధస్సు చరిత్ర, ప్రస్తుత వినియోగం, భవిష్యత్ అవకాశాలపై విలువైన అవగాహన పొందారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# స్వర్ణముఖి ప్రక్షాళన మన సంస్కృతికి పునరుజ్జీవనం



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) స్వర్ణముఖి నది పుణ్యతరంగిణికి పునర్వైభవం శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం అంటేనే పంచభూత లింగాలలో వాయులింగ క్షేత్రంగా ప్రసిద్ధి. అటువంటి పవిత్ర క్షేత్రానికి ఉత్తర ద్వారంగా, భక్తుల పాపాలను హరించే స్వర్ణముఖి నది ఒక జీవధార. ఋషులు, మహర్షులు తమ తపస్సును ఆచరించడానికి ముందు ఈ నదిలో పవిత్ర స్నానాలు ఆచరించి, ఆ జలాలను దైవికమైనవిగా భావించేవారు. స్వర్ణముఖి ప్రక్షాళన మన సంస్కృతికి పునరుజ్జీవనం ఈ నదిని శుభ్రం చేయడం అంటే కేవలం వ్యర్థాలను తొలగించడం కాదు, మన పూర్వీకుల తపస్సును, పవిత్రతను గౌరవించుకోవడం. ఋషులు పునీతులైన పుణ్యతీర్థం మన స్వర్ణముఖి ఏ నది ఒడ్డున వేలాది సంవత్సరాలుగా భక్తి పారవశ్యం నెలకొందో, ఆ నదిని కాపాడుకోవడం మన కనీస బాధ్యత. నిర్మల జలధార దైవానికి నమస్కారం స్వర్ణముఖి నది ప్రక్షాళన కార్యక్రమం భవిష్యత్ తరాలకు మనం ఇచ్చే అతిపెద్ద కానుక. స్వచ్ఛమైన స్వర్ణముఖి శ్రీకాళహస్తి క్షే- కొత్త శోభ నిర్మల జలధార దైవానికి నమస్కారం స్వర్ణముఖి నది ప్రక్షాళన కార్యక్రమం భవిష్యత్ తరాలకు మనం ఇచ్చే అతిపెద్ద కానుక. స్వచ్ఛమైన స్వర్ణముఖి శ్రీకాళహస్తి క్షేత్రానికి కొత్త శోభ నదిని శుద్ధి చేద్దాం మనసును పవిత్రం చేసుకుందాం స్వర్ణముఖి కేవలం ఒక నది కాదు, అదొక ఆధ్యాత్మిక ప్రవాహం. దానిని పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మనం ప్రకృతిని, దైవాన్ని ఆరాధిస్తున్నాం స్వర్ణముఖి నదికి జీవకళ నిత్య హారతికి సంసిద్ధం పూర్వం ఋషులు స్నానమాచరించి పునీతులైన పుణ్యధార, మన శ్రీకాళహస్తి స్వర్ణముఖి. ఆ పవిత్ర నదిని కాపాడుకుందాం. స్వర్ణముఖి ప్రక్షాళన'కు శ్రీకారం చుడుతూ, మన ఊరి జీవనాడికి పూర్వ వైభవాన్ని తెద్దాం ఆలయము రాష్ట్ర దేవాలయాల్లో నెంబర్ వన్ స్థానంలో నిలిచిన శ్రీకాళహస్తి దేవస్థానం. ఇక్కడ ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది కీ చాలా ప్రత్యేకత ఉంది ఋషుల సైతం పూర్వం ఈ నదిలో స్నానం ఆచరించి స్వామివారి దర్శనానికి వచ్చేవారు అని ప్రతీది కాలక్రమేనా ఈ నది ఎటువంటి అభివృద్ధికి నోచుకోకుండా చాలా దుర్భర స్థితికి చేరువైంది శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి సూచనలు సలహాలతో ఆలయ ట్రస్ట్ బోర్డ్ మెంబర్ కోలా విశాలాక్షి చొరవతో స్వర్ణముఖి నది ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు ఈ బృహత్కరమైన కార్యక్రమాన్ని దేవస్థానం ఈవో మరియు చైర్మన్, దేవస్థాన పారిశుధ్య కార్మికులు అదేవిధంగా శ్రీకాళహస్తి పట్టణ మున్సిపల్ కమిషనర్ మున్సిపాలిటీ పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు దేవస్థానం మున్సిపల్ సిబ్బంది కాకుండా శ్రీకాళహస్తి లో పుట్టిన ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని స్వర్ణముఖి నదిని నది యొక్క చరిత్రను కాపాడటం మనందరి బాధ్యత అని ఆలయ ట్రస్ట్ బోర్డ్ నెంబర్ కోలా విశాలాక్షి అన్నారు,

# జాబ్ ఔట్ సోర్సింగ్ ఇన్కమ్ ఆథర్ సోర్సింగ్

- **పక్కా'టౌన్ "ప్లానింగ్ తోనే అక్రమ నిర్మాణాలు**
- **ఔట్ సోర్సింగ్ అధికారులే అక్రమ నిర్మాణాలకు బిల్డింగ్ ప్లానర్స్**
- **పై స్థాయి అధికారుల కళ్ళు కప్పి వసూళ్లు**
- **జేబులు నింపుకుంటూ.. ప్రభుత్వ ఖజానాకు గండి**
- **రోజు రోజుకు పెంచుకుంటూ పోతున్న రెమ్యూనిరేషన్**
- **వసంత నగర్ లో ఓ అక్రమ నిర్మాణదారుని తో బేరసరాలు కొంత చిల్లర తో భారీ డీల్**
- **ఫిర్యాదులు ఇవ్వకండి ప్లీజ్ అంటూ ఫిర్యాదు పేపర్లు లాక్కొని బైకు లో పెట్టుకొని వెళ్ళిపుతున్న వైనం**



కూకట్ పల్లి(ప్రశ్నన్యూస్) కూకట్ పల్లి,మూసాపేట టౌన్ ప్లానింగ్ అధికారుల పనికి 24 గంటలు,రెండు చేతులు సరిపోవటం లేదేమో..అనిపిస్తుంది వీళ్ళ కష్టం చుస్తే ఎంతలా కష్ట పడుతున్నారంటే... అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే వారి పై ఫిర్యాదులు రాకుండా చూడటం ఎవరు,ఎవరు ఫిర్యాదులు ఇచ్చారో వారి డాటా అంత అక్రమ నిర్మాణదారులకు చేరవేయటం.. బిల్డింగ్ పని బయట తొందరగా పూర్తి చేసుకోమని సలహాలువ్వటం ..ఏమైనా ప్రాబ్లమ్ వస్తే నేను చూసుకుంటాను లే అని చెప్పి భరోసా ఇవ్వటం లో వంటి కష్టం. కొంత మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేసేది ప్రభుత్వ ఉద్యోగం సేవలు చేసేది అక్రమ నిర్మాణదారులకు. ఆధర్ ఇన్కమ్ పై మోజు పడి,సిటీజన్స్ ఎవరైనా అక్రమ నిర్మాణాల పై ఫిర్యాలు ఇవ్వటానికి మున్సిపల్ ఆఫీస్ ఇన్ వార్డు కి వస్తే ఫిర్యాదు ఇవ్వొద్దు ప్లీజ్ అంటూ ఫిర్యాదు పేపర్లు లాక్కొని బైక్ కవర్లో పెట్టుకొని వెళ్లిపోతున్నారు. అక్రమ నిర్మాణదారులతో కుమ్మకై.. ఫిర్యాదులు అందకుండా చేసి.. అక్రమ నిర్మాణదారునికి ఫెవర్ గా ఉంటూ వారు వేసే చిల్లరకు ఆశపడి. ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టి. వారి జేబులు నింపుకుంటున్నట్టు సమాచారం. ఇటీవల వసంత్ నగర్ లో ఓ అక్రమ నిర్మాణదారుడు ఏకంగా ఒకేసారి 4 అక్రమ నిర్మాణాలు చేపట్టగా అతని వద్ద నుండి ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కొంత మొత్తం లో తీసుకొని అట్టి అక్రమ నిర్మాణాలకు రక్షణగా నిలిచారని జనాల గుసగుసలు. అట్టి ఉద్యోగి సహకారం తోనే ఆ అక్రమ నిర్మాణం రంగు రంగులు గా వెలిగి గృహప్రవేశాలు కూడా జరిగాయంట. ఇదే ధైర్యం తోనే మరో అక్రమ నిర్మాణం కూడా మొదలు పెట్టి పూర్తి చేయటానికి సిద్ధంగా ఉన్నారంటా. ఎంత దుస్సహాసం కదా.. దానికి నిదర్శనమే ధర్మారెడ్డి కాలనీ లోని ప్లాట్ నంబర్ ఎంఐజి 93 లో కొనసాగుతున్న భారీ అక్రమ నిర్మాణం, భగత్ సింగ్ నగర్ లో ప్లాట్ నంబర్ 1030. కింది స్థాయి ఉద్యోగులు ఇంత దుర్మార్గలకు పాల్పడుతుంటే పై స్థాయి ఉద్యోగులు లేరా అంటే ఎందుకు లేరు ఉన్నారు అంటే ఉన్నారు. వారికీ తెలిస్తే కదా ఎన్ని అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయో బయటకి రారు. సిబ్బందిని అడగరు. ఇన్ఫర్మేషన్ ఈజ్ వేల్త్ అని వచ్చిన ఇన్ఫర్మేషన్ తోనే కష్టపడి పని చేస్తున్నట్టు పబ్లిక్ కి దృశ్యం సినిమా చూపిస్తున్నారు. ఒకవైపు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అక్రమ నిర్మాణాలు ఎట్టి పరిస్థితుల్లో జరగనివ్వం అని హైడ్రా లాంటి గొప్ప గొప్ప కార్యాలతో కూల్చేస్తుంటే వీరు ఇలా చేయడం ఎంత హ్యా?యమైన చర్య. ఇంత ఓపెన్ గా దందా జరుగుతుంటే పై స్థాయి ఉద్యోగులు దృష్టి సారించి చర్యలు తీసుకొని అట్టి అక్రమ నిర్మాణాలపై,అక్రమ నిర్మాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోక పోతే ప్రభుత్వం పై ప్రభుత్వ ఉద్యోగుల పై ప్రజలకు ఉన్న కాస్తో కూస్తో నమ్మకం పోయి,భవిష్యత్ లో ప్రజలు నిబంధనలను తుంగలో తొక్కే అవకాశం ఉంది.

## గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌లో కాసం ఫ్యాషన్స్ షాపింగ్ మాల్ ఘన ప్రారంభం

**సినీనటి అనసూయ సందడి**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌లో కాసం ఫ్యాషన్స్ 28వ షోరూమ్‌ను ప్రముఖ సినీనటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఆమె రాకతో షాపింగ్ మాల్ పరిసరాలు అభిమానుల కేరింతలు, ఆటపాటలతో సందడిగా మారాయి. ఈ సందర్భంగా అనసూయ భరద్వాజ్ మాట్లాడుతూ, ఆధునిక ఫ్యాషన్‌కు అనుగుణంగా నిత్యనూతన కలెక్షన్లు, విభిన్న డిజైన్లతో కాసం ఫ్యాషన్స్ వినియోగదారుల విశ్వాసాన్ని సంపాదించుకుందని అన్నారు. గజ్వేల్ ప్రజలకు ఈ షోరూమ్ అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొంటూ, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు కాసం ఫ్యాషన్స్‌లో షాపింగ్ చేయాలని కోరారు. అనంతరం లేడీస్, జెంట్స్, కిడ్స్ వేర్ విభాగాలను సందర్శించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కాసం ఫ్యాషన్స్ డైరెక్టర్లు కాసం నమశ్శివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్ మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా తెలుగు రాష్ట్రాల్లో ప్రజల ఆదరణతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఇప్పటివరకు 28 స్టోర్లను విజయవంతంగా ప్రారంభించామని తెలిపారు. తక్కువ ధరలకు నాణ్యమైన, అధునాతన వస్త్రాలను వినియోగదారులకు అందించడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే గజ్వేల్‌లో స్థానిక యువతకు ఉపాధి కల్పించే దిశగా ఈ సంస్థ ద్వారా సుమారు 150 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు లేని నిరుద్యోగ యువతకు కూడా తమ సంస్థ ఉపాధి కల్పిస్తోందని చెప్పారు. అనసూయ భరద్వాజ్‌ను చూసేందుకు ఉదయం నుంచే అభిమానులు, యువతులు, యువకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అభిమానుల హర్షధ్వానాలు, కేరింతలతో షాపింగ్ మాల్ పరిసరాలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. ఈ కార్యక్రమంలో గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్లు రాజమౌళి, గాడిపల్లి భాస్కర్, ఆర్యవైశ్య నాయకులు రుక్మయ్య, కైలాస ప్రభాకర్, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.సి. సంతోష్, షాపింగ్ మాల్ నిర్వాహకులు పుల్లూరు అరుణ్ కుమార్, విశాల్, వరుణ్, అరుణ్, కార్తీక్, కాసం ఫణిత్, కాసం సాయికృష్ణ, యాంసాని ప్రవీణ్తో పాటు పట్టణ ప్రముఖులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చేపల ఉత్పత్తి పెరుగుదలతో మత్స్యకారులకు ఆదాయం

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వ అధికారులతో భేటీ**



సిరిసిల్ల( ప్రశ్న న్యూస్)ప్రభుత్వ పథకాలతో చేపల ఉత్పత్తి పెరుగుదలతో మత్స్యకారులకు ఆదాయం వృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రపంచ బ్యాంక్ బృందం, కేంద్ర ప్రభుత్వ అధికారులు, జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు చైర్మన్ కమిటీ కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలిశారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో మత్స్యకారుల ఆర్థిక వృద్ధికి దోహద పడుతుందని తెలిపారు. దీంతో చేపల ఉత్పత్తి పెరుగుతుందని మత్స్యకారుల సంక్షేమ, అభివృద్ధి కొనసాగుతుందని తెలిపారు. సహకార సంఘాలకు ఆర్థిక సహాయం అంశాలను కమిటీ సభ్యులకు వివరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిబోయినపల్లి మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని బృందం సందర్శించింది. ఉత్పత్తి వివరాలు, ఆదాయం, నిర్వహణ పై అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో వరల్డ్ బ్యాంక్ బృందం కమిటీ సభ్యులు జూలియన్ మిలియన్, అనుజా శుక్లా, ఆర్పీ సిలార్డ్, ఇంతిసార్ ఎ. సిద్దిఖీ, దీపా సుమన్, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో ప్రారంభం కానున్న భీంగల్ కోర్టు ఏర్పాట్లపై న్యాయవాదుల పరిశీలన



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా, భీంగల్ లో ఇటీవల నిర్మించిన నూతన కోర్టు భవనాన్ని సోమవారం ఆర్మూర్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధ్యక్షుడు ప్రవీణ్, సీనియర్ న్యాయవాది భూపతి రెడ్డి, న్యాయవాదులు ఏలేటి గంగాధర్, చైతన్య, సురేష్ తదితరులు కోర్టు హాళ్లు, న్యాయవాదుల గదులు, మౌలిక సదుపాయాలను పరిశీలించి ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. నూతన కోర్టు ప్రారంభంతో స్థానిక ప్రజలకు, న్యాయవాదులకు మెరుగైన న్యాయ సేవలు అందుబాటులోకి వస్తాయని వారు తెలిపారు.

# అప్పుడే అఖిల్ అక్కినేని 'లెనిన్' ఓటీటీ రిలీజ్ అప్‌డేట్..




చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న యాక్టర్లలో ఒకడు టాలీవుడ్ నటుడు అక్కినేని అఖిల్. ఈ సారి ఎలాగైనా హిట్టు కొట్టాలని మేకోవర్ మార్చుకుని లాంగ్ గ్యాప్ తర్వాత 'లెనిన్'గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు అఖిల్. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ జులై 10న గ్రాండ్‌గా విడుదల కానుంది.ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిత్రయూనిట్ చెప్పిన మాటలు లెనిన్ గ్రాండ్ సక్సెస్ అవడం పక్కా అని ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నట్టు చెప్పకనే చెబుతున్నాయి. ఇదిలా ఉంటే సినిమా థియేటర్లలోకి రాకముందే అప్పుడే ఓటీటీ రిలీజ్‌కు సంబంధించిన ఆసక్తికర వార్తను షేర్ చేశారు మేకర్స్. లెనిన్ పోస్ట్ థియాట్రికల్ రైట్స్‌ను పాపులర్ టెలివిజన్ నెట్‌వర్క్ జీ దక్కించుకుంది. జీ నెట్‌వర్క్ లెనిన్ మూవీ డిజిటల్, శాటిలైట్ రైట్స్‌ను దక్కించుకుంది. థియాట్రికల్ రన్ తర్వాత జీ5లో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది.ఆయా ప్లాట్‌ఫాంలలో విడుదల తేదీలపై మేకర్స్ థియాట్రికల్ రిలీజ్ తర్వాత క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ చిత్రంలో శివాజీ, సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన లెనిన్ టైటిల్ గ్లింప్స్ మూవీ విలేజ్ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో సాగనున్నట్టు హింట్ ఇచ్చేసింది.

## రానాతో రిలేషన్ షిప్‌పై ప్రచారాలు



దక్షిణాది స్టార్ హీరోయిన్ త్రిష కృష్ణన్, నటుడు రానా దగ్గుబాటి మధ్య ఉన్న స్నేహం గురించి గతంలో ఎన్నో వార్తలు వచ్చాయి. వీరిద్దరి అనుబంధంపై తరచూ చర్చలు జరుగుతూనే ఉంటాయి. ఈ నేపథ్యంలో త్రిష గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రానాతో తనకున్న బంధం గురించి చేసిన వ్యాఖ్యలు మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. త్రిష మాట్లాడుతూ.. తనకు, రానాకు దాదాపు 18 ఏళ్ల వయసు నుంచే పరిచయం ఉందని చెప్పారు. అప్పట్లో తాను చెన్నైలోని టి.నగర్‌లో నివసించేదాన్నని, ఎదురుగా ప్రముఖ నిర్మాత డి. రామానాయుడు కుటుంబం ఇల్లు ఉండేదని గుర్తు చేసుకున్నారు. రానా కూడా తన బాల్యంలో ఎక్కువ కాలం చెన్నైలోనే గడిపాడని, అలా చిన్నప్పటి నుంచే ఇద్దరి మధ్య స్నేహం ఏర్పడిందని తెలిపారు. తమ అనుబంధాన్ని త్రిష ఆసక్తికరంగా వివరిస్తూ.. మా కథకు ముగింపు ఉండదు. కొన్నిసార్లు చాలా మంచి స్నేహితులుగా ఉంటాం. మరికొన్ని సందర్భాల్లో అసలు మాట్లాడుకోం కూడా. మా బంధం ఒక లవ్–హేట్ రిలేషన్‌షిప్‌లాంటిది అని చెప్పారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ స్నేహం కొనసాగుతోందని, జీవితంలో ఎలాంటి పరిస్థితులు వచ్చినా పూర్తిగా ఒకరినొకరు దూరం చేసుకోలేని బంధం తమదని వెల్లడించారు. రానాను చాలామంది "లేడీస్ మ్యాన్" అని పిలవడం గురించి అడిగిన ప్రశ్నకు త్రిష నవ్వుతూ స్పందించారు.అవును.. అతను లేడీస్ మ్యాన్. అందులో ఎలాంటి సందేహం లేదు. అది నిజమే అంటూ స్పష్టంగా చెప్పారు. అయితే అదే సమయంలో రానాలో తనకు అత్యంత నచ్చే విషయం అతని వ్యక్తిత్వమని వివరించారు. రానా ఎంత పెద్ద సినీ కుటుంబానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ, ఎప్పుడూ గర్వంగా ప్రవర్తించడని త్రిష చెప్పారు. అతను చాలా గ్రేస్‌ఫుల్ పర్సన్. మా మధ్య గొడవ జరిగినా, మాట్లాడుకోకపోయినా.. ఎప్పుడూ అందరితో మర్యాదగా, గౌరవంగా ప్రవర్తిస్తాడు. ఇతరులకు ఇచ్చే గౌరవమే అతనిలో నాకు ఎక్కువగా నచ్చే లక్షణం అని ఆమె పేర్కొన్నారు. రానా నిజమైన జెంటిల్‌మన్ అని, తనకు నచ్చిన విధంగానే జీవించే వ్యక్తి అని కూడా త్రిష ప్రశంసించారు. తన సినీ ప్రయాణం ప్రారంభ దశలో 'వర్షం' సినిమా కోసం జరిగిన ఫోటోషూట్ సమయంలోనే రానాను మొదటిసారి కలిశానని త్రిష గుర్తు చేసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తమ స్నేహం ఎన్నో దశలు దాటిందని, కానీ పూర్తిగా ముగిసిన సందర్భం ఎప్పుడూ లేదని చెప్పారు.

## సెన్సార్ పనులు పూర్తి చేసుకున్న 'ఓ సుకుమారి'




ఐశ్వర్య రాజేశ్, తిరువీర్ జంటగా నటించిన 'ఓ సుకుమారి' సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (CBFC) ఈ చిత్రానికి U/A సర్టిఫికెట్ జారీ చేసింది. ఫాంటసీ అంశాలతో కూడిన ఈ రొమాంటిక్ కామెడీ చిత్రాన్ని జులై 1న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.

గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో భరత్ దర్శన్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మహేశ్వర రెడ్డి మూలి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాజకీయ నాయకుడు కావాలనుకునే ఓ యువకుడు, సుకుమారి (ఐశ్వర్య రాజేష్) అనే పల్లెటూరి అమ్మాయి ప్రేమలో పడతాడు. అయితే ఆమెను ఎవరు తాకినా షాక్ కొట్టడం అనే విచిత్రమైన సమస్య చుట్టూ కథనం హాస్యభరితంగా, ఆసక్తికరంగా సాగుతుందని తెలుస్తోంది.ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా, ప్రస్తుతం పోస్ట్–ప్రొడక్షన్ దశలో ఉంది. తెలుగుతో పాటు తమిళం, ఇతర భాషల్లోనూ ఒకేసారి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. U/A సర్టిఫికెట్ రావడంతో ఈ సినిమా కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా నిలుస్తుందని అంచనాలు నెలకొన్నాయి.

## హీరో చెప్పిందే ఫైనల్.. హీరోయిన్‌ను పట్టించుకునేవారు కాదు..

### – జెండర్ వివక్షపై కృతి సనన్ సంచలన వ్యాఖ్యలు



సినీ పరిశ్రమ వెలుపల నుంచి చూస్తే గ్లామర్, స్టార్‌డమ్ మాత్రమే కనిపిస్తాయి. కానీ ఆ మెరుపుల వెనుక ఎన్నో అసమానతలు, సవాళ్లు, వివక్ష కూడా ఉంటాయని పలువురు నటీమణులు గతంలో వెల్లడించారు. తాజాగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ కూడా సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొనే జెండర్ వివక్షపై బహిరంగంగా మాట్లాడి చర్చనీయాంశంగా మారారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన కృతి సనన్.. తన కెరీర్ ప్రారంభ దశలో ఎదుర్కొన్న కొన్ని చేదు అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ముఖ్యంగా సినిమా ప్రమోషన్స్ సమయంలో ఓ హీరో తనను కావాలనే పక్కన పెట్టేందుకు ప్రయత్నించాడని, తాను ఏ ప్రమోషనల్ ఈవెంట్‌కు హాజరుకావాలో కూడా ఆయనే నిర్ణయించాలనుకున్నాడని తెలిపారు.అలాంటి పరిస్థితి తనకు తీవ్ర అవమానంగా అనిపించిందని, నా అవసరం లేదనుకుంటే మీరు ఒక్కరే సినిమా ప్రమోట్ చేసుకోండి అని చెప్పి తాను వెనక్కి తగ్గినట్లు వెల్లడించారు. సినిమా సెట్స్‌లో కూడా మహిళా నటీమణులకు, పురుష నటులకు ఇచ్చే ప్రాధాన్యంలో స్పష్టమైన తేడా కనిపించేదని కృతి అన్నారు. హీరోలకు పెద్ద వానిటీ వాన్లు, విశాలమైన గదులు, లగ్జరీ కార్లు ఏర్పాటు చేస్తే.. హీరోయిన్లకు మాత్రం చిన్న గదులు, సాధారణ వాహనాలు కేటాయించేవారని చెప్పారు. తనకు గదుల పరిమాణం లేదా కార్లపై ఆసక్తి లేదని, కానీ అలాంటి తేడాలు మహిళలను తక్కువగా చూసే భావనను కలిగిస్తాయని ఆమె వ్యాఖ్యానించారు. సీనియర్ హీరోల విషయంలో కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు సహజమేనని అంగీకరించిన కృతి.. కొత్తగా వచ్చిన హీరోల విషయంలో కూడా అదే పరిస్థితి కొనసాగుతుందని చెప్పారు. అసిస్టెంట్ డైరెక్టర్లు హీరో సమయాన్ని దృష్టిలో పెట్టుకుని హీరోయిన్లను గంటల ముందే సెట్స్‌కు పిలిచి వేచి ఉండేలా చేసేవారని ఆమె విమర్శించారు.తాను నటనలో ప్రొఫెషనల్ ట్రైనింగ్ తీసుకోకపోవడంతో పాత్ర గురించి దర్శకులను ప్రశ్నిస్తే లేదా ఏదైనా సూచన చేస్తే.. నువ్వు ఎక్కువగా ఆలోచిస్తున్నావ్ అంటూ తన మాటలను పట్టించుకునేవారు కాదని కృతి తెలిపారు. అయితే అదే విషయాన్ని ఓ పురుష నటుడు చెబితే వెంటనే అంగీకరించి, అతని సూచనకు ప్రాధాన్యం ఇచ్చేవారని ఆమె పేర్కొన్నారు. మహిళలు అభిప్రాయం చెబితే దాన్ని అతిగా చూస్తారని, పురుషులు మాట్లాడితే మాత్రం దాన్ని వారి కమిట్‌మెంట్‌గా భావిస్తారని ఆమె విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో మౌనంగా ఉండడం కంటే, సమాన గౌరవం కోసం గొంతు విప్పడం అవసరమని కృతి సనన్ అభిప్రాయపడ్డారు. కార్యాలయంలో గానీ, సినిమా సెట్స్‌లో గానీ మహిళలకు సమాన అవకాశాలు, గౌరవం దక్కాలని ఆమె కోరారు.

## మిస్టీరియస్ కిల్లర్



స్వీయ దర్శకత్వంలో నటిస్తూ.. పద్మనాభరెడ్డితో కలిసి పూర్వాజ్ నిర్మించిన ఉమెన్ సెంట్రిక్ స్పై థ్రిల్లర్ 'కిల్లర్'. జ్యోతి పూర్వాజ్ కథానాయిక. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఆదివారం హీరోయిన్ జ్యోతి పూర్వాజ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ చిత్రం నుంచి ఓ స్పెషల్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. సూపర్, మిస్టీరియస్ ఉమెన్‌గా కనిపిస్తున్న జ్యోతి పూర్వాజ్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఇందులో జ్యోతి పూర్వాజ్ సూపర్ షీగా కనిపించనున్నదని, ఓ వినూత్న ప్రపంచాన్ని ఈ చిత్రం ఆవిష్కరిస్తుందని, సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసి త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. మనీష్ గిలాడ, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: జగదీశ్ బొమ్మిశెట్టి, సంగీతం: అశీర్వాద్, సుమన్ జీవ, సమర్పణ: ఉర్వీజ్ పూర్వాజ్.

# ఘనంగా వన మహోత్సవం



తార్నాక( ప్రశ్న న్యూస్) తార్నాక నారాయణ పాఠశాలలో ఘనంగా వనమహోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జిఎం గోపాల్ రెడ్డి, ఎంజీఎం బాలపరమేశ్వరావు లు పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ పర్విన్ విద్యార్థుల చేత మొక్కలు నాటించి, ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం వలన భవిష్యత్తులో ఎదురయ్యే పరిణామాలను ఎదుర్కోవచ్చు అని వివరించారు. విద్యార్థుల చేతపచ్చని చెట్లు, ప్రగతికి మెట్లు", "వృక్షో రక్షతి రక్షితః"అనే నినాదాలు పలికిస్తూ ర్యాలి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణిలో దరఖాస్తుల వెల్లువ



మంథని ( ప్రశ్న న్యూస్)రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరిస్తూ నిష్పక్షపాతంగా పరిశీలిస్తున్నట్లు మంథని రెవెన్యూ డివిజనల్ అధికారి సురేష్ తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సమస్యల పరిష్కారానికి కేంద్ర బిందువుగా నిలిచిందని దరఖాస్తుదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం చేపట్టిన సాదా బైనమా లపై పట్టాదారుల ఫోర్జరీ సంతకాలతో దరఖాస్తులు సమర్పిస్తున్న విషయమై కచ్చితంగా పరిశీలించి పట్టాదారులకు న్యాయం చేయాలని కోరుతూ ప్రజావాణిలో సమర్పిస్తున్న దరఖాస్తులపై న్యాయం చేయాలని కోరుతున్నారు.మంథని మండలం బిట్టుపల్లి, జిల్లెల్లపల్లి గ్రామ శివారులో గల సర్వే నెంబర్ 56లోని 3 ఎకరాల 3 గుంటల భూమిపై ఫోర్జరీ సంతకాలతో సాదా బైనామ సమర్పించిన దరఖాస్తులను నిలిపివేయాలని కోరుతూ ఆధారాలతో సహా మహావాది సరోజినీ దేవి కుమారుడు సతీష్ కుమార్ ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించారు. అలాగే బిట్టుపల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 68/1లోని 5 ఎకరాల 17 గుంటలు, 68/2లోని 4 గుంటల భూమి విషయంలో కూడా అన్ని రకాల ఆధారాలు సమర్పించినట్లు సతీష్ కుమార్ తెలిపారు.

# రామగిరి మండల పరిధిలో పలు గ్రామాల్లో ఎస్. ఐ. ఆర్ సర్వే పరిశీలించిన .

## మాజీ ఎంపీపీ క్లస్టర్ ఇంచార్జి అరెల్లి దేవక్క - కొమురయ్య గౌడ్.




మంథని ( ప్రశ్న న్యూస్)బిజెపి చేసే మోసాన్ని రామగిరి మండల ప్రజలు మోసపోవద్దని బి ఎల్ వో, బి ఎల్. ఏ .లు మీ ఇంటి వద్దకు వచ్చి అన్ని విధాలుగా శూన్నంగా పరిచిలించి ఫామ్ ంపి మీ ఓటును కాపాడుకోవాలని కోరుతున్నామురామగిరి మండలంలో కల్వచర్ల, లొంకకేసారం గ్రామలలో ఎస్ ఐ ఆర్ ఇంటింటి సర్వే కార్యక్రమంఓటరు వివరాల పరిశీలన, దరఖాస్తుల స్వీకరణలో పాల్గొన్న రామగిరి మండల తాజా మాజీ ఎంపీపీ , క్లస్టర్ ఇంచార్జి ఆరేల్లి కొమురయ్య గౌడ్, కల్వచర్ల లొంకకేసారం గ్రామాలను పరిశీలించారు...!! లొంక కేసారం సర్పంచ్ వీరగోని రమాదేవి -శ్రీనివాస్, జి. పి. ఓ. తిరుపతమ్మ, కల్వ చెర్ల గ్రామ శాఖ అధ్యక్షులు రెండ్ల కృష్ణమూర్తి, లొంక కేసారం యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఇరుగురాల రమేష్ కన్న, కుంట చక్రవర్తి,ప్రసాద్, కల్వచర్ల మరియు లొంక కేసారం గ్రామంలో ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి బి ఎల్ వో శారదతో వెళ్లి ఓటరు వివరాలను పరిశీలించి,అవసరమైన దరఖాస్తులను ప్రజలకు అందజేసి నింపించే కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరి ఓటరు నమోదు, మార్పులు-చేర్పులు, తప్పుల సవరణలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు..ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటరు వివరాలు సరిగా ఉండేలా చూసుకోవాలని సూచించారు...అలాగే కల్వచర్ల పిఎస్ నంబర్ 35, 36, 37, 38,39, లొంకకేశరం పిఎస్ నెబర్ 40 ఇట్టి గ్రా లకు ఎస్ ఎంపీపీ ఆరేల్లి కొమురయ్య గౌడ్ క్లస్టర్ తన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంటింటి సర్వే ద్వారా ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత అధికారులకు అందించే విధంగా సూచన చేసారు.

# అంతర్జాతీయ సహకార ఉత్సవాల ఉత్తమ అవార్డు అందుకున్న

## పాపన్నపేట పి ఎస్ ఎస్ సీఈఓ నవీన్ కుమార్



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) అంతర్జాతీయ జిల్లా సహకార ఉత్సవాల భాగంగా మెదక్ జిల్లాలో గత మూడు రోజుగానిర్వహిస్తున్న సీఈఓ లకు శిక్షణ కార్యక్రమంలో భాగంగా పాపన్నపేట్ సి ఓ కు బెస్ట్ ఎంప్లాయ్ గా అవార్డు అందుకున్న పాపన్నపేట సీఈఓ నవీన్ కుమార్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉండి నా వృత్తిలో భాగంగా నన్ను నమ్మి జిల్లా సహకార అధికారి కరుణ చేతుల మీదుగా జిల్లా బెస్ట్ ఎంప్లాయ్ అవార్డుగా అందుకున్నందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని నాకు సహకరించిన సీఈవో లందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని పాపన్నపేట సీఈఓ నవీన్ కుమార్ తెలిపారు జిల్లాలో ఈ సమస్య ఉన్న గాని తమ దృష్టికి తీసుకెళ్తే వారి సమస్యగా పరిష్కరిస్తామని వారు తెలిపారు.

# ఓ విత్తనముగా నన్ను నాటండి, మహావృక్షం అవుతా

**పక్షులకు గూడు నవ్వుతా బాటసారి కి నీడనవుతా**

**ఆరోగ్యానికి మూలం అవుతా నన్ను పెంచండి**

**ఒక చిన్న విత్తనం మట్టిలో పడుతుంది.**

**దానికి భాష రాదు, దానికి కన్నీరు రాదు, కానీ దానికి ఒక కల ఉంది**








"నేను పెరిగి, ఒకనాటికి ఒక పక్షికి గూడు అవుతాను, ఒక అలసిన బాటసారికి నీడ అవుతాను, ఒక పసివాడి ఊపిరికి ప్రాణం అవుతాను" అని. ఆ కల నిజం కావాలంటే, ఆ విత్తనాన్ని ఎవరో ఒకరు మట్టిలో వేయాలి. చెయ్యి ఎవరిది - బుద్ధి జీవుడైన మనిషిది. సృష్టిలో ఆలోచించగలిగిన ఏకైక ప్రాణి మనిషి. కానీ ఆలోచన అంటే అధికారం కాదు - అది బాధ్యత. చెట్టును నరకగలిగిన శక్తి ఇచ్చిన ప్రకృతి, ఆ చెట్టును కాపాడాల్సిన కర్తవ్యాన్ని కూడా అదే చేతికి అప్పగించింది.

### ఒక్క లెక్క చెప్పనా

నువ్వు ఈ వాక్యం చదువుతున్న ఈ క్షణంలోనూ నీ ఊపిరితిత్తులు గాలిని పీలుస్తున్నాయి. ఒక్క రోజులో ఒక మనిషి దాదాపు ఐదు వందల యాభై లీటర్ల ప్రాణవాయువును (ఆక్సిజన్‌ను) తాగుతాడు. ఆ ఊపిరిని ఎవరు ఇస్తున్నారు - నువ్వు నిన్న నరికిన చెట్టు కాదు, నువ్వు రేపు నాటబోయే చెట్టు. ఒక్క మనిషి ఏడాదికి తీసుకునే గాలిని తయారు చేయటానికి కనీసం ఏడు నుంచి ఎనిమిది పెద్ద చెట్లు అహర్నిశలూ శ్రమిస్తాయి. అవి ఏ బిల్లూ పంపవు, ఏ కూలీ అడగవు, ఏ కృతజ్ఞతా కోరవు. ఊపిరిని ఉచితంగా ఇచ్చే ఈ మౌన దాతలను మనం గొడ్డలితో సత్కరిస్తున్నామంటే - అది కృతఘ్నత కాదా

ఒక్క మనిషికి ఏడు చెట్లు అవసరమైతే, కోట్ల మంది మనుషులకు ఎన్ని కోట్ల చెట్లు కావాలి ఈ లెక్క వేసుకుంటే గుండె ఆగిపోతుంది. మనం చెట్లను నాటటం అంటే భూమికి మనం చేసే దానం కాదు - భూమి మనకు ఇచ్చిన అప్పును తీర్చే విధి.

### వనజీవి ఒక ఆదర్శం

తెలంగాణ నేల ఒక అపురూప మనిషిని కన్నది - వనజీవి రామయ్య. ఆయనకు కోట్లు లేవు, పెద్ద పదవులు లేవు. చేతిలో ఒక సంచి, అందులో కొన్ని విత్తనాలు, గుండెలో కొండంత ప్రేమ - ఇదే ఆయన ఆస్తి. జీవితమంతా కోట్లాది మొక్కలు నాటి, "చెట్టును నాటటమే నా పూజ" అని నమ్మిన ఆ మనిషి మనకు ఒక సందేశం ఇచ్చాడు - పర్యావరణ రక్షణ ప్రభుత్వాల పని కాదు, అది ప్రతి పౌరుడి ప్రార్థన. ఆయనలా కోట్లు నాటలేకపోయినా, ప్రతి ఒక్కరం ఒక్క మొక్క నాటగలం. ఒక్కొక్కరం ఒక్కొక్కటి నాటితే - కోట్ల మంది కోట్ల చెట్లు అవుతాయి. వర్షాకాలం మొదలైంది. మట్టి తడిసింది. ఆకాశం భూమిని ముద్దాడుతోంది. విత్తనం ప్రాణం పోసుకోవటానికి ఇదే సరైన సమయం. ఈ వర్షాకాలంలో ప్రతి ఇంటి ముంగిటా ఒక తులసి, ప్రతి వీధిలో ఒక వేప, ప్రతి ఖాళీ నేలలో ఒక ఔషధ వనం మొలవాలి. మనం నాటే ప్రతి మొక్కా భవిష్యత్ తరాలకు మనం రాసిచ్చే వీలునామా.

### అంతరించిపోతున్న ప్రాణుల ఆర్తనాదం

**కళ్ళు మూసుకుని ఒక్క క్షణం వినండి - అది ఒక పక్షి ఏడుపు.**

బట్టమేక పిట్ట (గ్రేట్ ఇండియన్ బస్టర్డ్) - ఒకప్పుడు మన గడ్డి మైదానాల రాజు. ఈ రోజు దేశమంతా కలిపి కేవలం నూట యాభై పక్షులు మాత్రమే మిగిలాయి. అది ఏడాదికి ఒకే గుడ్డు పెడుతుంది. కరెంటు తీగలకు తగిలి, ఆవాసాలు కోల్పోయి, అది తుడిచిపెట్టుకుపోయే అంచున నిలబడింది. మన కళ్ళ ముందే ఒక జాతి భూమి నుంచి శాశ్వతంగా చెరిగిపోతోంది.రాబందులు - ఒకప్పుడు ఆకాశాన్ని కప్పేసిన ఈ ప్రకృతి పారిశుద్ధ్య కార్మికులు, ఒక్క మందు విషప్రభావానికి తొంభై తొమ్మిది శాతం అంతరించిపోయాయి. పిచ్చుక - మన కిటికీల్లో గూళ్ళు కట్టిన చిన్నారి, నగరాల్లో ఇప్పుడు అరుదైన అతిథి. అలుగు (పాంగోలిన్), నదీ డాల్ఫిన్, మంచు చిరుత - ఒక్కొక్క పేరూ ఒక్కొక్క వీడ్కోలు. మొక్కల మాటేమిటి మనం ఔషధాలుగా పూజించిన మొక్కలే ఇప్పుడు మృత్యుముఖంలో ఉన్నాయి. ఎర్ర చందనం - శేషాచల కొండల గర్భంలో మాత్రమే పుట్టే ఈ అపురూప వృక్షం, స్మగ్లర్ల గొడ్డలికి బలైపోతోంది. సర్పగంధ, రక్తపోటుకు దివ్యౌషధమైన ఈ మొక్క, విచక్షణారహిత సేకరణతో అంతరించిపోతోంది. మనం జబ్బు పడ్డప్పుడు ఏ మొక్క మనల్ని బతికిస్తుందో, ఆ మొక్కనే మనం నిర్దాక్షిణ్యంగా చంపుతున్నాం. ఔషధాన్నే చంపిన చేతికి, రేపు వ్యాధి వచ్చినప్పుడు ఏ మందు మిగులుతుంది.

### జీవవైవిధ్యం ఒక వీణ

సృష్టి ఒక వీణ. అందులో ప్రతి ప్రాణీ ఒక తీగ. పులి ఒక తీగ, తేనెటీగ ఒక తీగ, వానపాము ఒక తీగ, పిచ్చుక ఒక తీగ. ఒక్క తీగ తెగినా వీణ మౌనమవుతుంది. తేనెటీగ లేకపోతే పరాగసంపర్కం ఆగుతుంది, పంట పండదు, మనిషి ఆకలితో అల్లాడతాడు. వానపాము లేకపోతే నేల ప్రాణం కోల్పోతుంది. ప్రతి ప్రాణీ మరో ప్రాణి బతుకుకు ముడిపడి ఉంది. ఈ గొలుసులో మనిషి ఒక్క లంకె మాత్రమే, యజమాని కాదు. ఒక ఆకు రాలినా, ఒక పక్షి మూగబోయినా, అది కేవలం ఆ జీవి మరణం కాదు మన మనుగడలో ఒక భాగం చనిపోవటం.

### రేపటి తరాలకు మనం ఏమిస్తాం.?

ఒక్క ప్రశ్న అడుగుతాను. నీ మనవడు ఒకనాడు నిన్ను అడిగితే "తాతా, పిచ్చుక అంటే ఏమిటి. చందనం చెట్టు ఎలా ఉంటుంది. స్వచ్ఛమైన గాలి ఎలా ఉంటుంది." నువ్వు ఏం సమాధానం చెప్తావు. ఫోటోలో చూపిస్తావా ఇది మన తప్పు వల్ల భవిష్యత్ తరాలకు జరిగే అతి పెద్ద అన్యాయం - వాళ్ళు ఎప్పుడూ చూడని అందాన్ని, ఎప్పుడూ పీల్చని ఊపిరిని మనం వాళ్ళ నుంచి దొంగిలించటం.

### మనం వదిలి వెళ్ళాల్సింది సంపద కాదు..

పచ్చదనం. బంగారం కాదు, స్వచ్ఛమైన గాలి. భవనాలు కాదు, ప్రాణం ఉన్న భూమి.ఇప్పుడే, ఈ వర్షాకాలంలోనేప్రవచనాలు చాలు. ఇక చేతలు మొదలవ్వాలి.ఈ వర్షాకాలంలో ప్రతి ఒక్కరం ఒక్క మొక్క నాటుదాం. ఒక్కటి కాదు, వీలైతే ఔషధ వనమే నాటుదాం. తులసి, వేప, రావి, మారేడు, ఉసిరి, ఇవి కేవలం చెట్లు కాదు, భవిష్యత్ ఆసుపత్రులు, భవిష్యత్ ఆక్సిజన్ కర్మాగారాలు. మనం నాటుదాం, మన బిడ్డలకు నాటటం నేర్పుదాం, మన ఇరుగుపొరుగును ఆదర్శంగా ప్రేరేపిద్దాం. ఒక్క మనిషి ఒక్క మొక్క నాటితే - అది ఒక చెట్టు. కోట్ల మంది ఒక్కొక్క మొక్క నాటితే, అది ఒక నాగరికత.ఊపిరిని అక్షరాలుగా మార్చి, ఆ అక్షరాలను మొక్కలుగా నాటుదాం.నేల తల్లి గుండె మళ్ళీ పచ్చగా కొట్టుకునేలా చేద్దాం. ఎందుకంటే, భూమిని కాపాడటం అంటే, మనల్ని మనం కాపాడుకోవటమే.

సింహాచలం లక్ష్మణస్వామి
వ్యవస్థాపక అధ్యక్షులు
ఆయుర్వేద పరంపర మూలికా
వైద్య మహా సంఘం (Rg. No.979/2025 )
నారపపల్లి, హైదరాబాద్
Mail info.apmvms@gmail.com

# జీహెచ్ఎంసీలో ఐటీ ఉద్యోగుల కంటే శానిటేషన్ కార్మికులకే ఎక్కువ జీతాలు

## బీటెక్, ఎంటెక్ చదివినా తక్కువ జీతాలే

**"జీహెచ్ఎంసీలో వేతనాల అంశం ప్రస్తుతం హాట్ టాపిక్గా మారింది. దానికి కారణం ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన 25 మంది ఐటీ నిపుణుల భర్తీకి విడుదలైన టెండర్ నోటిఫికేషన్. ఇందులో బీటెక్, ఎంటెక్ అర్హత కలిగిన ఐటీ ఉద్యోగులకు రూ. 28 వేల నుంచి రూ.42 వేల లోపు వేతనాలు ప్రతిపాదించారు. అయితే.. జీహెచ్ఎంసీలో పనిచేసే పర్మనెంట్ శానిటేషన్ కార్మికుల జీతాలు రూ. 50 వేల నుంచి రూ.80 వేల వరకు ఉన్నాయి. కొత్తగా డెరెక్ట్ రిక్రూట్ చేసుకొనే శానిటేషన్ సిబ్బంది సైతం రూ.30-35 వేల మధ్య చెల్లిస్తుండగా.. బీటెక్, ఎంటెక్ చదివినా ఐటీ నిపుణులకు మాత్రం తక్కువ జీతంతో నోటిఫికేషన్ విడుదలైంది"**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్ ) హైదరాబాద్ మహానగరపాలక సంస్థ ( జి హెచ్ఎం సి) ఐటీ నిపుణుల కొరతను తీర్చేందుకు జారీ చేసిన ఒక టెండర్ నోటిఫికేషన్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నగరంలో ఎంతో నైపుణ్యం కలిగిన ఐటీ ఉద్యోగులకు ఆఫర్ చేస్తున్న వేతనాలు శాశ్వత శానిటేషన్ కార్మికుల జీతాల కంటే చాలా తక్కువగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. జీహెచ్ఎంసీ ఒక సంవత్సరం కాల పరిమితిపై ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన 25 మంది ఐటీ ప్రొఫెషనలన్ను నియమించుకోవడానికి తాజాగా నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. అయితే ఇందులో ప్రతిపాదించిన పే స్కేల్ ప్రస్తుతం హాట్ టాపిక్గా మారింది. ఈ అధికారిక నోటిఫికేషన్ ప్రకారం.. హార్డ్వేర్ ఇంజనీర్లు, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్లు, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్లు, నెట్వర్క్ అడ్మినిస్ట్రేటర్లు, ప్రోగ్రామర్లు, టీమ్ లీడర్లు, జీఐఎస్ అనలిస్టు, వెబ్ డిజైనర్ల వంటి వివిధ విభాగాల నిపుణుల కోసం జీహెచ్ఎంసీ దరఖాస్తులను కోరింది. అయితే వీరికి కేటాయించిన వేతనాల వివరాలు గమనిస్తే.. 12 మంది హార్డ్వేర్ ఇంజనీర్ల పోస్టులకు నెలకు రూ. 28 వేల చొప్పున వేతనం ప్రతిపాదించారు. కనీసం మూడేళ్ల అనుభవంతో పాటు ఎంటెక్ ఉన్నత విద్యార్హత కలిగిన సీనియర్ జీఐఎస్ అనలిస్టు నెలకు రూ.37 వేలు మాత్రమే చెల్లించనున్నారు. బీటెక్ విద్యార్హతతో పాటు ఆరు సంవత్సరాల సుదీర్ఘ అనుభవం గల వెబ్ డిజైనర్ పోస్టుకు కేవలం రూ.42 వేలు వేతనంగా నిర్ణయించారు.ఈ వేతన ప్యాకేజీలను జీహెచ్ఎంసీలోని శానిటేషన్ కార్మికుల జీతాలతో పోల్చి చూస్తే ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగుచూశాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధుల సమాచారం ప్రకారం.. జీహెచ్ఎంసీలో కొత్తగా చేరే శానిటేషన్ కార్మికులకే (ఔట్ సోర్సింగ్ కాకుండా) ప్రారంభంలో నెలకు రూ. 30 వేల నుంచి రూ.35 వేల వరకు వేతనం అందుతోంది. ఇక కార్పొరేషన్లో శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తున్న సీనియర్ శానిటేషన్ కార్మికులు తమ సర్వీసు కాలాన్ని బట్టి నెలకు రూ. 50 వేల నుంచి గరిష్టంగా రూ.80 వేల వరకు జీతాలు అందుకుంటున్నారు. విద్యా అర్హతలతో సంబంధం లేకపోయినా సీనియారిటీ కారణంగా వారి జీతాలు ఐటీ ఉద్యోగుల కంటే ఎంతో మెరుగ్గా ఉన్నాయి. కారణమని వివరించారు. ప్రభుత్వం 2022 సంవత్సరం నుంచి ఔట్సోర్సింగ్ ఐటీ పోస్టులకు సంబంధించి పీఆర్సీ నిబంధనలను అమలు చేయకపోవడంతో పాత జీతాలనే కొనసాగించాల్సి వస్తోందని పేర్కొన్నారు. కాగా, ఇలా తక్కువ జీతాలు పొందుతున్న ఐటీ ఉద్యోగులు జీహెచ్ఎంసీలో సాఫ్ట్వేర్ వెబ్ అప్లికేషన్ డెవలప్మెంట్, సర్వర్లు, డెస్క్టాప్లు, ప్రింటర్ల నిర్వహణతో పాటు మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ విభాగానికి సలహాలు అందించడం వంటి కీలక సాంకేతిక బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

# ఊరు బయట కలెక్టర్ కార్యాలయాలు
# ప్రజలకు ప్రత్యక్ష నరకయాతన

**- ఇంటిగ్రేటెడ్ కార్యాలయం పేరుతో పేదలపై రవాణా భారం - మహిళలు, వృద్ధులు వెళ్లాలంటే కనీస సౌకర్యాలు కరువు**
**- బస్సు సౌకర్యాలు లేని జంగల్ లో కలెక్టర్ కార్యాలయాల ఏర్పాటు - సామాన్య ప్రజలు వెళ్లడానికి నిర్మించారా లేక ఉన్నత వర్గాల కోసమా.?**
**- నాలుగు, ఐదు సార్లు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాలంటే జేబులు కాలి కావాల్సిందే**

**(ఆర్ కె - ప్రశ్న న్యూస్ బ్యూరో)**



ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో నిర్మించిన రంగారెడ్డి, మేడ్చల్– మల్కాజిగిరి ఇంటిగ్రేటెడ్ కలెక్టర్ కార్యాలయాలు జిల్లాలో మాత్రం సామాన్యులకు అందని ద్రాక్షగా మారాయనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ల కార్యాలయాలు నగరానికి చాలా దూరంగా, ప్రధాన రహదారులకు సైతం చాలా చాలా దూరంగా అడవిని తలపించే ప్రాంతంలో ఏర్పాటు చేయడంతో ప్రతి చిన్న పని కోసం వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలకు అన్ని విధాల సౌకర్యం కల్పించాల్సిన కలెక్టర్ కార్యాలయాలు రవాణా సమస్యలతో ప్రజలను, సిబ్బందిని




బాధించే కేంద్రంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఆర్టీసీ బస్సు లేదు, ఆటో, ఓలా, ఉబర్ మాత్రమే దిక్కు

రంగారెడ్డి జిల్లా, మేడ్చల్-- మల్కాజిగిరికలెక్టర్ల కార్యాలయాలకు నేరుగా చేరుకునే ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు సొంతంగా ఆటోలు, ఓలా, ఉబర్ క్యాబ్‌లపైనే ఆధారపడాల్సి వస్తోంది. కనీసం షేరింగ్ ఆటోల సౌకర్యం కూడా లేకపోవడంతో రోజువారీ కూలీ పనులు చేసుకునే వారు, వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు ఒక్కసారి కార్యాలయానికి రావడానికే వందలు, వెయ్యిలలో ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొందని, సమస్య పరిష్కారం కాక మళ్లీ రావాల్సి వస్తే ఆ ఖర్చు భరించలేని భారంగా మారుతోందిని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సందర్శన వేళలో
అధికారులు ఉంటారో లేదో తెలియని పరిస్థితిఫిర్యాదు లేదా దరఖాస్తుతో కార్యాలయానికి వచ్చిన ప్రజలకు సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటారనే హామీ లేదు. “రేపు రండి”, “మరోసారి రండి” ఆఫీసర్ లీవ్ లో ఉన్నాడు,” సచివాలయానికి వెళ్ళాడు,” మీటింగ్ లో ఉన్నారు” అనే సమాధానాలతో ప్రజలు మళ్లీ అదే ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఒక్క సమస్య పరిష్కారం కోసం నెలల తరబడి తిరగాల్సి వస్తే రవాణా ఖర్చులను పేదలు ఎలా భరిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### ఉద్యోగులకే కష్టమైతే, ప్రజల పరిస్థితి ఏమిటి.?

రంగారెడ్డి మేడ్చల్-- మల్కాజిగిరి కలెక్టర్ కార్యాలయానికి చేరుకోవడంలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాంటప్పుడు సాధారణ ప్రజల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ప్రభుత్వం ఆలోచించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ వాహనాలు అధికారులకు అందుబాటులో ఉన్నా, సామాన్య ప్రజలకు అలాంటి సౌకర్యం లేదు. కేసీఆర్ హయాంలో తీసుకున్న నిర్ణయాలను సరిదిద్దాలి మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు హయాంలో నిర్మించిన ఈ కార్యాలయాల స్థాన ఎంపికపై అప్పట్లోనే అనేక విమర్శలు వచ్చాయని ప్రజలు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను గుర్తించి ఈ నిర్ణయాలను పునఃసమీక్షించాలని కోరుతున్నారు.

### ప్రధాన రహదారులకు సమీపంలోనే కార్యాలయాలు కావాలి

జిల్లా కేంద్ర కార్యాలయాలు ప్రజలకు సులభంగా చేరుకునేలా నగరంలో, ప్రధాన రహదారులు, ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో ఉండాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పరిపాలన ప్రజలకు దగ్గర కావాలే గానీ, ప్రజలు పరిపాలన కోసం అడవులను, దూర ప్రాంతాలను వెతుక్కుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఉండకూడదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రజలకు సేవ చేయాల్సిన కార్యాలయాలు నగరం బయట ఉంటే ఎలా.?

ప్రజలకు సేవ చేయాల్సిన కలెక్టర్ కార్యాలయాలు ప్రజలకు భారంగా మారితే ఆ పరిపాలన ఉద్దేశం ఏమిటి.? ప్రభుత్వ రవాణా సౌకర్యం అధికారులకే పరిమితమైతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటి.? ఇంటిగ్రేటెడ్ కార్యాలయం పేరుతో ప్రజలపై అదనపు ఆర్థిక భారం మోపడం ఎంతవరకు సమంజసం.? రంగారెడ్డి జిల్లా, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రజల ఈ ఆవేదనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి, కలెక్టర్ కార్యాలయాలను ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాంతానికి తరలించే అంశాన్ని పరిశీలించాలని రంగారెడ్డి , మల్కాజ్గిరి-- మేడ్చల్ జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# 116 ఏళ్ల భక్తురాలికి వీఐపీ బ్రేక్ దర్శనం

**- బామ్మ ఆశీర్వాదం తీసుకున్న టీటీడీ ఈవో**



**తిరుమల (ప్రశ్న న్యూస్ )** తమిళనాడు బామ్మ నవనీతమ్మకు టీటీడీ అరుదైన అవకాశం కల్పించింది. ఆమెతో పాటు కుటుంబ సభ్యులకు వీఐపీ బ్రేక్ దర్శనం దక్కింది. టీటీడీ అధికారులు దర్శనం ఏర్పాట్లు చేసి దగ్గరుండి స్వామి దర్శనం చేయించారు. వెంకన్నను దర్శించుకున్న బామ్మ, కుటుంబ సభ్యులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. బామ్మకు వేదాశీర్వచనం చేయించి, పట్టువస్త్రం కప్పి, తీర్థప్రసాదాలు కూడా అందజేశారు. టీటీడీ ఈవో బామ్మ ఆశీర్వాదం తీసుకున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన 116 ఏళ్ల బామ్మ నవనీతమ్మకు తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనం లభించింది. టీటీడీ అధికారులు బామ్మతో పాటుగా కుటుంబ సభ్యులకు దర్శన ఏర్పాట్లు చేసి దగ్గరుండి స్వామి దర్శనానికి తీసుకెళ్లారు. వెంకన్న సేవలో పాల్గొన్న అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం చేశారు. టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర నవనీతమ్మకు పట్టువస్త్రం కప్పి.. తీర్థ ప్రసాదాలు అందజేశారు.. ఆయన బామ్మ కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. నవనీతమ్మకు, ఆమె కుటుంబ సభ్యులకు శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించామని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. అనంతరం రంగనాయకుల మండపంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర వేదపండితులతో వేదాశీర్వచనం చేయించి, పట్టువస్త్రం కప్పి, తీర్థప్రసాదాలు అందజేశారన్నారు. తన అమ్మమ్మ కోరికను నెరవేర్చి, తమ కుటుంబ సభ్యులందరికి శ్రీవారి దర్శనం కల్పించినందుకు టీటీడీకి ఆమె మనవడు దిక్పతి ధన్యవాదాలు తెలిపారన్నారు. నవీనతమ్మ వివరాలు సేకరించడంలో తమ వంతు సహకారం అందించిన సోషల్ మీడియా మిత్రులకు, అలాగే వెంటనే స్పందించి ఆమెను గుర్తించిన టీటీడీ విజిలెన్స్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. శ్రీవారి భక్తురాలి జీవితకాల కోరిక నెరవేరినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.తమిళనాడుకు చెందిన నవనీతమ్మ వయసు 116 సంవత్సరాలు. ఆమె కుటుంబ సభ్యులుతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి అలిపిరి నడక మార్గంలో వెళ్లారు. బామ్మను గమనించిన ఓ భక్తురాలు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. బామ్మ వివరాల కోసం టీటీడీ ఛైర్మన్ ఓ ట్వీట్ చేశారు.. ఆమె వివరాలు తెలిస్తే తమను తమిళనాడుకు చెందిన నవనీతమ్మ వయసు 116 సంవత్సరాలు. ఆమె కుటుంబ సభ్యులుతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి అలిపిరి నడక మార్గంలో వెళ్లారు. బామ్మను గమనించిన ఓ భక్తురాలు



వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. బామ్మ వివరాల కోసం టీటీడీ ఛైర్మన్ ఓ ట్వీట్ చేశారు.. ఆమె వివరాలు తెలిస్తే తమను సంప్రదించాలని కోరారు. కొన్ని గంటల్లోనే టీటీడీ విజిలెన్స్ సిబ్బంది బామ్మ పేరు నవనీతమ్మ, తమిళనాడు నుంచి వచ్చారని వివరాలు సేకరించారు. బామ్మ తిరుపతి జీవకోనలో బంధువుల దగ్గర ఉంటున్నట్లు తెలిసింది. వెంటనే స్పందించిన టీటీడీ ఛైర్మన్.. నవనీతమ్మతో పాటుగా కుటుంబ సభ్యులకు వీఐపీ బ్రేక్ దర్శనం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇవాళ వారంతా తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. సంప్రదించాలని కోరారు. కొన్ని గంటల్లోనే టీటీడీ విజిలెన్స్ సిబ్బంది బామ్మ పేరు నవనీతమ్మ, తమిళనాడు నుంచి వచ్చారని వివరాలు సేకరించారు. బామ్మ తిరుపతి జీవకోనలో బంధువుల దగ్గర ఉంటున్నట్లు తెలిసింది. వెంటనే స్పందించిన టీటీడీ ఛైర్మన్.. నవనీతమ్మతో పాటుగా కుటుంబ సభ్యులకు వీఐపీ బ్రేక్ దర్శనం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇవాళ వారంతా తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు.

# సచివాలయంలో నిలిచిపోయిన క్యాటరింగ్ సేవలు

**- టాప్ ఫ్లోర్ కు భోజనం కట్**
**- సీఎం, సీఎస్ కార్యాలయాలు ఉండే ఆరో ఫ్లోర్ కు అల్పాహారం, భోజనం సరఫరా బంద్**
**- దాదాపు రెండేళ్లుగా కాంట్రాక్టర్‌కు కోట్లలో బిల్లులు పెండింగ్**
**- బకాయిలు చెల్లించకపోవడంతో చేతులెత్తేసిన క్యాటరింగ్ నిర్వాహకుడు**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) ఉండే ఫ్లోర్ కు క్యాటరింగ్ సేవలు నిలిచిపోయాయి. గత రెండేళ్లుగా కాంట్రాక్టర్‌కు సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడంతో ఆయన సరఫరాను నిలిపివేశారు. ఈ పరిణామంతో సచివాలయంలోని ఉన్నతాధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సచివాలయంలోని ఆరో అంతస్తులో ఉండే ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కార్యాలయాల సిబ్బంది పాటు ఇతర ఉన్నతాధికారులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఫలహారాలు అందించే సేవలకు అంతరాయం ఏర్పడింది. పేరుకుపోయిన బకాయిలను కనీసం వాయిదాల పద్ధతిలోనైనా విడుదల చేయాలని కాంట్రాక్టర్ పలుమార్లు విన్నవించినప్పటికీ, అధికారులు స్పందించకపోవడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ బకాయిలు కోట్ల రూపాయల్లో ఉండటంతో ముడిసరుకులు కొనుగోలు, సిబ్బంది జీతాల చెల్లింపు భారంగా మారి కాంట్రాక్టర్ చేతులెత్తేసినట్లు సమాచారం. రాష్ట్రంలో వివిధ విభాగాలకు చెందిన కాంట్రాక్టర్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్న ఆందోళనల నడుమ ఈ ఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశమైంది. ఇటీవల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వంటి సీనియర్ నేతల



హామీతో కాంట్రాక్టర్లు తమ నిరసనలను వాయిదా వేసుకున్న విషయం తెలిసిందే. అయితే, ఏకంగా ముఖ్యమంత్రి కార్యాలయానికే ఆహార సరఫరా నిలిచిపోవడం గమనార్హం.

### ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన
# చేర్యాల తహసీల్దార్

**- నాలా కన్వర్షన్ కోసం రూ.70,000 డిమాండ్ చేసినట్లు ఆరోపణ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లాలో ఒక ప్రభుత్వ అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. చేర్యాల తహసీల్దార్‌గా విధి నిర్వహణలో ఉన్న కొర్రా దిలీప్ నాయక్, రూ.70,000 లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. ఏసీబీ అధికారులు విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, నాగపురి గ్రామంలోని పలు సర్వే నంబర్లకు సంబంధించి 11 నాలా (వ్యవసాయేతర భూమి మార్పిడి) దరఖాస్తుల ప్రాసెసింగ్ కోసం ఫిర్యాదుదారుడి నుంచి తహసీల్దార్ ఈ లంచం డిమాండ్ చేశారు. జమున కనకమ్మ మరియు ఇతరుల పేర్లపై ఉన్న 30 గుంటల భూమికి సంబంధించిన పనుల నిమిత్తం ఆయన ఈ మొత్తాన్ని తీసుకున్నారు. సోమవారం మధ్యాహ్నం చేర్యాలలోని తన కార్యాలయంలోనే దిలీప్ నాయక్ లంచం తీసుకుంటుండగా, పక్కా ప్రణాళికతో ఏసీబీ అధికారులు ఆయనను పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దిలీప్ నాయక్‌ను అరెస్ట్ చేసి, హైదరాబాద్‌లోని ఏసీబీ కేసుల విచారణ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎవరైనా అధికారులు లంచం డిమాండ్ చేస్తే తమ టోల్-ఫ్రీ నెంబర్ 1064కు సమాచారం అందించాలని ఏసీబీ ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# మైక్రోసాఫ్ట్‌లో భారీ కోతలు

**- 4,800 మంది ఉద్యోగులపై వేటు!**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ భారీస్థాయిలో ఉద్యోగుల తొలగింపును ప్రకటించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విభాగంలో పెట్టుబడులను కేంద్రీకరించే లక్ష్యంతో చేపట్టిన సంస్థాగత పునర్వ్యవస్థీకరణలో భాగంగా, సుమారు 4,800 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు సోమవారం వెల్లడించింది. ఇది సంస్థ మొత్తం ప్రపంచవ్యాప్త శ్రామిక శక్తిలో 2.1 శాతానికి సమానం. ఈ ఉద్యోగాల కోత ప్రధానంగా కంపెనీ వాణిజ్య కార్యకలాపాలు, ఎక్స్‌బాక్స్ గేమింగ్ విభాగాలపై ప్రభావం చూపనుంది. అయితే, ఏఐ సాంకేతికత అందుబాటులోకి రావడం వల్ల ఈ ఉద్యోగాలను భర్తీ చేయడం లేదని, మారుతున్న వ్యాపార ప్రాధాన్యతలకు అనుగుణంగా కేవలం వ్యూహాత్మక మార్పులు మాత్రమే చేస్తున్నామని మైక్రోసాఫ్ట్ స్పష్టం చేసింది.తాజా లేఆఫ్‌ల ప్రభావం ఎక్స్‌బాక్స్ గేమింగ్ విభాగంపై తీవ్రంగా ఉంది. 2027 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ విభాగంలో సిబ్బంది సంఖ్యను 20 శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ, అందులో భాగంగా తక్షణమే 1,600 మందిని విధుల నుంచి తొలగించింది. దీనితో పాటు, నాలుగు గేమింగ్ స్టూడియోలను మూసివేయడం లేదా విక్రయించడం ద్వారా గేమింగ్ వ్యాపారాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాలని మైక్రోసాఫ్ట్ నిర్ణయించింది. టెక్ పరిశ్రమలో ఏఐపై పెట్టుబడులు పెరుగుతున్న క్రమంలో ఉద్యోగాల కోతలు సర్వ సాధారణమయ్యాయి. ఈ ఏడాది ఇప్పటికే అమెజాన్, మెటా వంటి అగ్రగామి సంస్థలు వేలాది ఉద్యోగాలను తగ్గించాయి. ఏఐ మౌలిక సదుపాయాలపై భారీగా వ్యయం చేస్తూనే, మరోవైపు నిర్వహణ ఖర్చులను నియంత్రించుకునే వ్యూహంతో మైక్రోసాఫ్ట్ ఈ నిర్ణయం తీసుకుంది. 2026 ప్రథమార్ధంలో కంపెనీ షేర్లు 23 శాతం క్షీణించడం కూడా ఈ కఠిన చర్యలకు ఒక కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా, తొలగించిన ఉద్యోగులకు అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలను అందిస్తున్నట్లు కంపెనీ పేర్కొంది.

# వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్

**- స్పందన తెలిపేందుకు మెటాకు గడువు పొడిగింపు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) వాట్సాప్ ప్రతిపాదించిన ‘యూజర్‌నేమ్’ ఫీచర్‌పై కేంద్ర ప్రభుత్వం వ్యక్తం చేసిన ఆందోళనలకు వివరణ ఇచ్చేందుకు మాతృసంస్థ మెటాకు గడువును మరో మూడు రోజుల పాటు పొడిగించారు. ఈ ఫీచర్ వల్ల పెరిగే సైబర్ నేరాల ముప్పుపై ప్రభుత్వ అధికారులతో మెటా చర్చలు జరుపుతున్న నేపథ్యంలో, స్పందన తెలియజేసేందుకు జూలై 9 వరకు సమయం ఇస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది.ఫోన్ నంబర్లతో సంబంధం లేకుండా ప్రత్యేక యూజర్‌నేమ్‌ల ద్వారా సందేశాలు పంపుకునేందుకు ఈ నూతన ఫీచర్ వీలు కల్పిస్తుంది. ఇది వినియోగదారుల గోప్యతను మెరుగుపరిచినప్పటికీ, సైబర్ మోసాలు, ఫిషింగ్, ఫేక్ అరెస్టు స్కామ్‌లు, ఇతరుల పేర్లతో జరిగే మోసాలకు ఆస్కారం ఉందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ గత వారం మెటాకు నోటీసులు జారీ చేసింది. భద్రతాపరమైన అంశాలను పూర్తిగా సమీక్షించే వరకు ఈ ఫీచర్ అమలును నిలిపివేయాలని ఆదేశించింది.ఈ క్రమంలో గత శుక్రవారం నాడు ఐటీ శాఖ అధికారులతో మెటా ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ అంశంపై పూర్తిస్థాయి వివరణ ఇచ్చేందుకు మరింత సమయం కావాలని వారు కోరడంతో ప్రభుత్వం గడువును పొడిగించింది. ప్రభుత్వ ఆందోళనలు పూర్తిగా నివృత్తి అయ్యే వరకు ఈ ఫీచర్‌ను భారత్‌లో ప్రవేశపెట్టబోమని వాట్సాప్ ఈ సందర్భంగా హామీ ఇచ్చింది. ప్రస్తుతానికి ఈ ఫీచర్ అందుబాటులోకి రాలేదని, ఈ ఏడాది చివరి నాటికి దశలవారీగా తీసుకువస్తామని మెటా స్పష్టం చేసింది. ఖాతా రిజిస్ట్రేషన్ కోసం ఫోన్ నంబర్ తప్పనిసరి అని, వినియోగదారుల భద్రత కోసం ఇప్పటికే అనేక పటిష్ఠ చర్యలు తీసుకున్నామని వెల్లడించింది. దాదాపు 50 కోట్లకు పైగా వినియోగదారులు ఉన్న భారత్‌లో డిజిటల్ భద్రతపై ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588